ANN తెలుగు
Follow: @ANNTELUGU
08-05-2025
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 156 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



# పాక్‌కు షాక్

# OPERATION SINDOOR

## పాక్‌లోని.. ఉగ్ర శిబిరాలు ఉఫ్


- వందమంది ఉగ్రవాదులు హతం.. తొమ్మిదిశిబిరాలు ఖతం.. ఖంగుతిన్న పాకిస్థాన్
- భారత్ కు అమెరికా, రష్యా, ఇజ్రాయిల్ తో సహా ప్రపంచం మద్దతు
- 25 నిమిషాల్లో.. 24 మిస్సైళ్లతో మెరుపు దాడి
- జైషే చీఫ్ మసూద్ అజర్ కుటుంబంలో 14మంది మృతి
- తెల్లవారుజామున దాడులతో పాక్ లో అలజడి
- సరిహద్దు గ్రామాల పౌరులపై పాక్ కాల్పులు 12మంది మృతి
- దాడిపై త్రివిధ దళాల ప్రెస్ మీట్.. రాష్ట్రపతితో ప్రధాని మోదీ భేటీ
- పాక్ సరిహద్దు రాష్ట్రాల సీఎంలతో అమిత్ షా సమావేశం
- ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న పాక్.. ఇంతటితో ఆపేయాలని పాక్ కు సూచించిన అమెరికా
- ఆపరేషన్ సిందూర్ పై దేశవ్యాప్తంగా హర్షా తిరేకాలు.. సైన్యాన్ని అభినందించిన రాహుల్, ఖర్గే, రేవంత్, కేసీఆర్, చంద్రబాబు,జగన్
- తెలంగాణ అధికారయంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన సీఎం రేవంత్

02

యావత్ భారతదేశం ఎదురుచూస్తున్న ఘట్టం ఆవిష్కృతమైంది. పహల్గామ్ ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. మంగళవారం అర్ధరాత్రి- బుధవారం తెల్లవారుజామున జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం దాడులతో గట్టి సమాధానం చెప్పింది. అంతా గాఢనిద్రలో ఉండగా అర్ధరాత్రి వేళ మెరుపు దాడులతో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌తోపాటు పాక్ భూభాగంలో ఉన్న ఉగ్రమూకల స్థావరాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. అసలేం జరుగుతుందో తెలియక పాక్ మొత్తం షాక్‌లో ఉండిపోయింది. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద శిబిరాలే లక్ష్యంగా ఈ దాడులు చేశాయి. కేవలం 25 నిమిషాల్లోనే త్రివిధ దళాలు ఈ 9 స్థావరాలను నేలమట్టం చేసినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.



## ఇది గర్వించే సమయం



- ఆపరేషన్ సింధూర్ దేశానికి గర్వకారణం
- ప్రతీకార దాడులు విజయవంతంగా పూర్తయ్యాయి
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ
- ప్రధాని అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం
- భారత సేనలు చేపట్టిన చర్యపై సభ్యుల హర్షధ్వానాలు వ్యక్తం
- రాష్ట్రపతితో ప్రధాని నరేంద్ర మోడీ భేటీ.. ఆపరేషన్ సింధూర్ నిర్వహించిన తీరుపై వివరణ
- ప్రధాని విదేశీ పర్యటనలు రద్దు.. నేడు అఖిలపక్ష సమావేశం

02

## మోగిన జంగ్ సైరన్



- సిటీలో నాలుగు చోట్ల ఆపరేషన్ అభ్యాస్
- పాల్గొన్న పోలీస్, ఫైర్, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది
- ఎయిర్ రైడ్ సైరన్లతో ప్రజల్ని అప్రమత్తం చేసిన అధికారులు
- 54 ఏళ్ల తర్వాత తొలిసారి యుద్ధ సన్నద్ధతపై మాక్ డ్రిల్స్

03



## పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం

- ఉగ్రవాద సదుపాయాలను నాశనం చేయాలి
- ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

**హైదరాబాద్, మహా:** పాకిస్థాన్‌లోని ఉగ్రవాద రహస్య స్థావరాలపై మన రక్షణ దళాలు జరిపిన దాడులను తాను స్వాగతిస్తున్నట్లు ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. ఈ దాడులను స్వాగతిస్తూ ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'మరో పహల్గామ్ వంటి ఘటన పునరావృతం కాకుండా పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం చెప్పాలి. పాకిస్థాన్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయాలి," అని ఒవైసీ పేర్కొన్నారు. తన పోస్టును ఆయన 'జై హింద్' నినాదంతో ముగించారు.

## ప్రతీకారం తీర్చుకుంటాం

### చీకటిని ఆసరాగా చేసుకొని ఇలా చేసింది

### ఎలా బదులివ్వాలో మాకూ తెలుసు

### పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కీలక వ్యాఖ్యలు



**ఇస్లామాబాద్:** ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేపట్టిన సైనిక చర్యను పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఖండించారు. తమ ఆత్మ రక్షణ కోసం తగిన సమయంలో ప్రతీకారం తీర్చుకుంటామని తెలిపారు. ఈ మేరకు తమ సైన్యానికి ఆదేశాలు జారీ చేసినట్టు పాక్ పీఎంఓ ఓ ప్రకటనలో తెలిపింది. పాకిస్తాన్ అత్యున్నత భద్రతా సంస్థ (ఎన్ఎస్‌సీ) సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. బదులు తీర్చుకునే అధికారం సాయుధ దళాలకు ఉందని తెలిపింది. షరీఫ్ అధ్యక్షతన కేబినెట్ మంత్రులు, సీనియర్ అధికారుల సమక్షంలో ఎన్ఎస్‌సీ భేటీ జరిగింది. ఈ దాడులను చట్టవిరుద్ధమైన చర్యగా ఎన్ఎస్‌సీ అభివర్ణించింది. భారత్ చర్యలు అంతర్జాతీయ చట్టాల ప్రకారం యుద్ధ చర్యలుగా పరిగణించబడుతున్నాయని పేర్కొంది. అంతకుముందు పీఓకేలో చేపట్టిన దాడులపై షెహబాజ్ షరీఫ్ స్పందించారు. ఉగ్రవాద శిబిరాలపై భారత క్షిపణి దాడులను యుద్ధ చర్యగా అభివర్ణించారు. దీనికి తగిన సమాధానం ఇస్తామని హెచ్చరించారు. భారతదేశం చీకటిని ఆసరాగా చేసుకుని పిరికితనంతో దాడి చేసింది.. ఈ దాడి సైనిక దాడి మాత్రమే కాదు, మన సార్వభౌమాధికారం.. గౌరవంపై కూడా దాడి అని చెప్పారు.



## మరింత భద్రత పెంచండి

### ఈ టైంలో రాజకీయాలకు తావులేదు

- రౌడీషీటర్లు, పాత నేరస్తుల పట్ల పోలీస్ శాఖ నిఘా
- ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి
- సోషల్ మీడియాలో అసవసరప్రకటనలు చేస్తే కఠిన చర్యలు
- శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలి
- పోలీసు ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు
- సైన్యానికి సంఘీభావంగా నేడు సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ర్యాలీ

03



## ఉగ్రవాదం అంతం కావాల్సిందే..

- భారత సైన్యం ప్రదర్శించిన తీరు గర్వకారణం
- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

**మహా:** ఉగ్రవాదం అంతం కావాల్సిందే అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అభిప్రాయపడ్డారు. భారత సైన్యం ప్రదర్శించిన తన సైనిక పాటవానికి ఒక భారతీయుడుగా తాను గర్వపడుతున్నాని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉగ్రవాదం, ఉన్మాదం ఏ రూపంలో ఉన్నా.. ఏ దేశంలో ఉన్నా.. ప్రపంచ మానవాళికి నష్టం కలిగించేదే తప్ప లాభం చేకూర్చేదికాదన్నారు. ఈ విషయంలో పాజిటివ్‌గా ఆలోచించే ప్రపంచ శక్తులన్నీ ఏకమై, ఉగ్రవాదాన్ని అంతమొందిస్తేనే శాంతి సామరస్యాలు నెలకొంటాయని తెలిపారు. భారత సైన్యం ఎంత వీరోచితంగా దాడులు చేసిందో అంతే అప్రమత్తంగా ఉండి దేశరక్షణలో మేము ఎవరికి తీసిపోమన్నట్టుగా వారికి శక్తి సామర్థ్యాలుండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాను అని కేసీఆర్ పేర్కొన్నారు.



## ఇద్దరూ ఇద్దరే!

### అందరి నోటా వారి మాటే

- ఆపరేషన్ సింధుర్‌లో ఝాన్సీ రాణులు
- సోషియా ఖురేషీ, వ్యోమికా సింగ్‌ల గురించే దేశ వ్యాప్తంగా చర్చ
- గూగుల్‌లో లక్షల మంది వారి కోసం సెర్చ్


వివరాలు 2లో

## భారత సైన్యానికి సెల్యూట్

మోడీ సర్కార్ దుష్ట శక్తుల అంతు చూస్తుంది
బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

03

మహా పత్రిక
ANN తెలుగు
2
OPERATION SINDOOR
WWW.MAHAADAILY.COM
గురువారం, హైదరాబాద్ | 08-05-2025



# ఇది గర్వించే సమయం

## ఆపరేషన్ సింధూర్ దేశానికి గర్వకారణం

ప్రతీకార దాడులు విజయవంతంగా పూర్తయ్యాయి

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ.. ప్రధాని అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం

భారత సేనలు చేపట్టిన చర్యపై సభ్యుల హర్షధ్వానాలు వ్యక్తం

రాష్ట్రపతితో ప్రధాని మోడీ భేటీ.. ఆపరేషన్ సింధూర్ నిర్వహించిన తీరుపై వివరణ

ప్రధాని విదేశీ పర్యటనలు రద్దు.. నేడు అఖిలపక్ష సమావేశం

**ఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా బుధవారం తెల్లవారుజామున భారత బలగాలు చేపట్టిన ఆపరేషన్ సింధూర్ దేశానికి గర్వకారణమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రధాని మోడీ నేతృత్వంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సేనలు దాడి చేసి దాదాపు 100 మంది ఉగ్రవాదులను హతమార్చడం దేశానికి గర్వకారణమని ప్రధాని అన్నారు. ప్రధాని అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆపరేషన్ సిందూర్ గురించి సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా.. భారత సేనలు చేపట్టిన చర్యను క్యాబినెట్‌లోని మంత్రులంతా బల్లలు చరిచి సమర్థించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సేనలు బుధవారం తెల్లవారుజామున ఆపరేషన్ సిందూర్ నిర్వహించాయి. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై దాడిచేసి దాదాపు 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. ఈ ఆపరేషన్ అనంతరం ప్రధాని మోడీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయ్యారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి ఆమెకు సమాచారం ఇచ్చారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని ముందుకు నడిపించిన మోడీ సారథ్యాన్ని మంత్రులంతా ఈ సందర్భంగా ప్రశంసించారు.

### నేడు అఖిలపక్ష సమావేశం..

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరన్ రిజుజు అఖిలపక్ష సమావేశం గురించి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. '2025 మే 8న ఉదయం 11 గంటలకు ఢిల్లీలోని పార్లమెంట్ లైబ్రరీ భవనంలోని కమిటీ రూమ్: జీ074లో ప్రభుత్వం అఖిలపక్ష నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది' అని ఆయన చెప్పారు. నేడు జరిగే అఖిలపక్ష సమావేశం చాలా కీలకం కానుంది. ఈ భేటీలో ప్రధాని మోడీ కూడా పాల్గొనే అవకాశం కన్పిస్తోంది. ఆపరేషన్ సిందూర్ వివరాలు.. భారత్ పాక్ సరిహద్దుల వద్ద ఉద్రిక్తతలు, సరిహద్దు భద్రత, సైనిక సన్నద్ధత తదితర విషయాలను అఖిలపక్ష నేతలకు కేంద్రం వివరించనుంది.

## మోడీ పర్యటనలు రద్దు..

**పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో భారత ప్రధాని చేపట్టాల్సిన పలు విదేశీ పర్యటనలు రద్దయ్యాయి. రద్దుకు గల కారణాలను కేంద్రం వెల్లడించినప్పటికీ దేశీయ అంశాలకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా విదేశీ పర్యటనలు రద్దైనట్టు తెలుస్తోంది. ఈ నెలలో క్రోయేషియా, నార్వే, నెదర్లాండ్స్ పర్యటించాల్సి ఉండగా ఇది రద్దైంది. మరో రెండు రోజుల్లో చేపట్టాల్సిన రష్యా పర్యటనను కూడా ప్రధాని మోదీ రద్దు చేసుకున్నారు. నాజీలపై సోవియట్ యూనియన్ విజయాన్ని పుస్కరించుకుని మే 9 విక్టరీ డే వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొనాల్సి ఉండగా పర్యటన చివరి నిమిషంలో రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ఈ విషయాన్ని రష్యా ప్రతినిధి కూడా ధ్రువీకరించారు. భారత్ తరపున మరో అధికారి హాజరు కావొచ్చని అన్నారు.**



# ఇద్దరూ ఇద్దరే!

## అందరి నోటా వారి మాటే

ఆపరేషన్ సింధుర్‌లో ఝాన్సీ రాణులు

సోషియా ఖురేషీ, వ్యోమికా సింగ్‌ల గురించే దేశ వ్యాప్తంగా చర్చ

గూగుల్‌లో లక్షల మంది వారి కోసం సెర్చ్

**మహా:** దేశ వ్యాప్తంగా ఆర్మీ కల్నల్ సోషియా ఖురేషీ, ఎయిర్ ఫోర్స్ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఎవ్వరి నోట విన్నా వారి పేర్లు వినిపిస్తోంది. దీనికి కారణం పహల్గాం నరమేధానికి ప్రతీకారంగా మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారత్ వైమానిక దళం పీవోకేతోపాటు పాక్ లోని ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేసిన తీరును ఈ ఇద్దరు వెల్లడించటమే. దీంతో లక్షలాది మంది ఈ ఇద్దరి గురించి తెలుసుకోవటానికి గూగుల్ ఇంజన్‌లో సెర్చ్ చేయటం గమనార్హం.

### ఆర్మీ కల్నల్ సోషియా ఖురేషీ

గుజరాత్ రాష్ట్రం వడోదరకు చెందిన సోఫియా ఖురేషీ బయో కెమిస్ట్రీ పోస్ట్ గ్రాడ్యుయేట్. తన కలను నిజం చేసుకోవటానికి 1999లో ఆర్మీలో చేరారు. చెన్నైలోని ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ నుంచి శిక్షణ తీసుకున్నారు. ఆ తర్వాత ఆర్మీలో లెఫ్టినెంట్‌గా నియమితులై ప్రస్తుతం కల్నల్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షణ దళంలో ఆరేళ్లపాటు పని చేశారు. కాంగోలో జరిగిన మిషన్ లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఇక, 2016లో పూణెలో జరిగిన ఎక్సర్ సైజ్ ఫోర్స్ 18 అనే అంతర్జాతీయ సైనిక విన్యాసంలో భారత సైనిక దళానికి నాయకత్వం వహించిన తొలి మహిళా అధికారిణిగా పేరు తెచ్చుకున్నారు. ఈ విన్యాసంలో 18 దేశాలు పాల్గొనడం గమనార్హం. ఇక, పంజాబ్ సరిహద్దుల్లో జరిగిన ఆపరేషన్ పరాక్రమ్‌లో చురుగ్గా పాల్గొన్న సోఫియా ఖురేషీ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ ప్రశంస పత్రాన్ని సాధించారు.

### ఎయిర్ ఫోర్స్ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్..

వైమానిక దళంలో చేరాలన్నది ఆర్మీ కుటుంబానికి చెందిన వ్యోమికా సింగ్ చిన్నప్పటి కల. చదువుకునే రోజుల్లోనే ఎన్‌సీసీలో చేరిన ఆమె ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేశారు. ఆ తరువాత ఎయిర్ ఫోర్స్ లో హెలికాప్టర్ పైలట్ గా చేరారు. 2024, డిసెంబరులో ఫ్లయింగ్ బ్రాంచ్ లో శాశ్వత కమిషన్ హోదాను సాధించారు. చీతా, చేతక్ హెలికాప్టర్లను నడపడంతో ఆమెది అందె వేసిన చెయ్యి. జమ్మూ కాశ్మీర్‌తో పాటు ఈశాన్య భారతదేశంలో ఎత్తైన చోట్ల, సవాళ్లతో కూడిన ప్రాంతాల్లో హెలికాప్టర్లను నడిపారు. పలు రెస్క్యూ ఆపరేషన్లలో పాల్గొని తనదైన ముద్ర వేశారు. ఈ క్రమంలో వాయుసేన పతకంతో పాటు పలు అవార్డులు గెలుచుకున్నారు.



# పాక్‌కు షాక్

## పాక్‌లోని.. ఉగ్ర శిబిరాలు ఉఫ్

### వందమంది ఉగ్రవాదులు హతం..

### తొమ్మిది శిబిరాలు ఖతం.. ఖంగుతిన్న పాకిస్థాన్

- భారత్ కు అమెరికా, రష్యా, ఇజ్రాయిల్ తో సహా ప్రపంచం మద్దతు
- 25 నిమిషాల్లో.. 24 మిస్సైళ్లతో మెరుపు దాడి
- జైషే చీఫ్ మసూద్ అజర్ కుటుంబంలో 14మంది మృతి
- తెల్లవారుజామున దాడులతో పాక్ లో అలజడి
- సరిహద్దు గ్రామాల పౌరులపై పాక్ కాల్పులు 12మంది మృతి
- దాడిపై త్రివిధ దళాల ప్రెస్ మీట్.. రాష్ట్రపతితో ప్రధాని మోదీ భేటీ
- పాక్ సరిహద్దు రాష్ట్రాల సీఎంలతో అమిత్ షా సమావేశం
- ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న పాక్.. ఇంతటితో ఆపేయాలని పాక్ కు సూచించిన అమెరికా
- ఆపరేషన్ సిందూర్ పై దేశవ్యాప్తంగా హర్షా తిరేకాలు.. సైన్యాన్ని అభినందించిన రాహుల్, ఖర్గే, రేవంత్, కేసీఆర్, చంద్రబాబు,జగన్
- తెలంగాణ అధికారయంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన సీఎం రేవంత్

(మహా నెట్ వర్క్ )

పహెల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో మెరుపుదాడి చేసింది. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ వ్యూహాత్మకంగా విరుచుకుపడింది. మే 7న తెల్లవారుజామున 1:05 నుంచి 1:30 వరకు జరిగిన ఈ దాడులను త్రివిధ దళాలు సంయుక్తంగా చేపట్టాయి. మొత్తం 9 టెర్రర్ కేంద్రాలను భారత్ టార్గెట్ చేసింది. కేవలం 25 నిమిషాల్లోనే ఆ ఉగ్ర స్థావరాలపై 24 మిస్సైళ్లతో మెరుపు దాడి చేసి పాక్‌ను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఈ దాడిలో వందమందికిపైగా ఉగ్రవాదులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఇందులో ఉగ్రవాద సంస్థలకు చెందిన కీలక నేతలున్నారు. ఈ మెరుపు దాడులకు సంబంధించిన వివరాలను కేంద్ర రక్షణ, విదేశాంగ శాఖ మీడియాకు వెల్లడించింది. విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ, కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మీడియాతో మాట్లాడారు. నిఘా వర్గాల నుంచి వచ్చిన అత్యంత కచ్చితమైన సమాచారంతోనే ఉగ్ర స్థావరాలపై దాడులు జరిపామని తెలిపారు. ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీకి శిక్షణ ఇచ్చిన శిబిరాలను ధ్వంసం చేశామన్నారు. ఇంతటితో ఆగకుంటే లెక్కకు లెక్క తప్పదని హెచ్చరించారు. ఆపరేషన్ సింధూర్ పై దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. సైన్యాన్ని ప్రజలు వీధుల్లోకి వచ్చి అభినందించారు. మరోవైపు పాక్ ప్రతీకారంతో రగులుతోంది. సరిహద్దుగ్రామాల ప్రజలపై కాల్పులకు తెగబడుతోంది.

### ఆపరేషన్ సిందూర్ ఇలా..

'ఆపరేషన్ సిందూర్' జరిపిన తీరును కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ వివరించారు. "పహల్గాం మృతులకు న్యాయం చేసేందుకే ఆపరేషన్ సిందూర్ చేపట్టాం. గత 30 ఏళ్లుగా పాక్ ఉగ్రమూకలకు సౌకర్యాలు కల్పిస్తోంది. ఆ దేశంతో పాటు పీఓకేలోనూ ఉగ్ర శిబిరాలు ఉన్నాయి. నిఘా వర్గాల సాయంతో మొత్తం 21 స్థావరాలను గుర్తించాం. అందులో తొమ్మిదింటిని లక్ష్యంగా చేసుకున్నాం. కేవలం ఉగ్ర శిబిరాలపైనే దాడులు చేశాం. పాక్ పౌరులకు హాని జరగకుండా వాటిని నిర్వహించాం. సైనిక శిబిరాలను లక్ష్యంగా చేసుకోలేదు. అర్ధరాత్రి 1.051.30 గంటల మధ్య ఈ ఆపరేషన్ జరిగింది. భారత్ టార్గెట్ చేసిన వాటిల్లో.. లాహోర్‌కు 40 కిలోమీటర్ల దూరంలోని మురిద్కేలో గల లష్కరే తోయిబా ఉగ్ర శిబిరం కూడా ఉంది. ఇక్కడ 26/11 ముంబయి దాడులకు పాల్పలడిన ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీ శిక్షణ తీసుకున్నారు'' అని కర్నల్ సోఫియా ఖురేషి వెల్లడించారు. చరిత్రలో తొలిసారి మిలిటరీ ఆపరేషన్ సంగతులను మహిళా అధికారులు వెల్లడించడం విశేషం.

### మరిన్ని దాడులకు ఛాన్స్

భారత్ పై మరిన్ని ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని సమాచారం అందిందని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ తెలిపారు. "భారత్‌పై మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందని సంకేతాలిచ్చాయి. వాటిని అడ్డుకోవడం, ఉగ్రవాద సమస్యను పరిష్కరించడం అత్యవసరమని భావించాం. కచ్చితమైన నిఘా సమాచారంతో ఉగ్ర స్థావరాలను గుర్తించి ధ్వంసం చేశాం. ఇది ఆరంభం మాత్రమే. పాక్ ఆర్మీ మద్దతు ఉన్న ఉగ్ర శిబిరాలను భారత సైన్యం పూర్తిగా ధ్వంసం చేస్తుందని నమ్ముతున్నాం. అప్పుడే ఉగ్రవాదాన్ని అడ్డుకోగలం'' అని మిస్రీ వెల్లడించారు.

### రాష్ట్రపతితో ప్రధాని భేటీ

పహెల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సక్సెస్ అయింది. ఇన్నాళ్లు పాక్ ప్రభుత్వం అండదండలతో ఆ దేశ భూభాగంలో కొనసాగుతున్న 9 ఉగ్రశిబిరాలపైకి ఇండియన్ ఆర్మీ మెరుపు దాడులు చేసింది. ఈ ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయ్యారు. కేంద్ర కేబినెట్ సమావేశం అనంతరం రాష్ట్రపతి భవన్ కు వెళ్లిన మోదీ అక్కడ ముర్ముతో భేటీ అయి ఈ ఆపరేషన్ కు సంబంధించిన వివరాలను తెలిపారు.

## 10 వరకు 165 విమానాలు రద్దు

ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో అనేక విమానసర్వీసులు రద్దయ్యాయి. ఈ క్రమంలోనే విమానాయాన సంస్థ ఇండిగో కీలక ప్రకటన చేసింది. మే 10 వరకు 165కు పైగా విమానాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఎయిర్ స్పేస్ ఆంక్షలతో అమృతసర్, బికనీర్, చండీగఢ్, ధర్మశాల, గ్వాలియర్, జమ్ము, జోధ్‌పుర్, కిషన్‌గఢ్, లేహ్, రాజ్‌కోట్, శ్రీనగర్ సహా పలు ఎయిర్‌పోర్టుల నుంచి మే 10 ఉదయం 5.30 గంటల వరకు 165కి పైగా విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. ప్రయాణికులు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌లను చూసుకోవాలని తెలిపింది. ఆ విమాన ప్రయాణికులు రీషెడ్యూల్ లేదా టికెట్ క్యాన్సిల్ చేసుకునే సదుపాయం కల్పిస్తున్నట్లు వెల్లడించింది. ఇందుకు ఎలాంటి అదనపు ఛార్జీలు లేవని, క్యాన్సిల్ చేసుకుంటే పూర్తి రీఫండ్ కూడా ఇస్తామని పేర్కొంది.

## భారత్ ఖతం చేసిన తొమ్మిది ఉగ్రకేంద్రాలు ఇదే

**ముజఫరాబాద్, కోట్లి, బహవల్ పూర్, రావలకోట్, చక్వారీ, భీంబర్, నీలం వ్యాలీ, జీలం, చక్వాల్‌లోని టెర్రర్ క్యాంపులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయి. ఇవన్నీ నిఘా సంస్థలు ఉగ్రవాద శిబిరాలకు ఆశ్రయం ఇస్తున్నాయని చాలా కాలంగా అనుమానిస్తున్న ప్రాంతాలు. ఈ ప్రదేశాలు లష్కరే తోయిబా , జైషే మొహమ్మద్ లతో అనుబంధంగా ఉన్నాయని సమాచారం. ఈ రెండు ఉగ్రవాద గ్రూపులు సంవత్సరాలుగా భారతదేశంలో పలు దాడులకు కారణమయ్యాయి. దాడికి గురైన తొమ్మిది ప్రదేశాల్లో ఐదు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్నాయి. నాలుగు పాకిస్థాన్ ప్రధాన భూభాగంలో ఉన్నాయి. ముఖ్యంగా బహవల్ పూర్ జైషే మహమ్మద్ కు బలమైన స్థావరంగా ఉంది.**

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM
3
OPERATION SINDOOR
గురువారం, హైదరాబాద్ | 08-05-2025

# రాష్ట్రాన్ని కాపాడుకుందాం

## పాతబస్తీలో ఉన్న వారిని దేశం దాటిస్తేనే సేఫ్

### వారిని వెంటనే దేశం పంపించాలె

### సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యే రాజాసింగ్ రిక్వెస్ట్



**మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక విజ్ఞప్తి చేశారు. మన రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే వారిని వెంటనే దేశం దాటించాలని కోరారు. ట్విట్టర్ వేదికగా వీడియో విడుదల చేసిన ఆయన.. పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ.. ఇవాళ దేశ వ్యాప్తంగా మంచి వాతావరణం ఉందని, పహల్గామ్‌లో మన భారతీయుల మీద దాడి చేసిన ఉగ్రవాదుల స్థావరాలపై ఇండియన్ ఆర్మీ దాడి చేసి చంపేసిందని తెలిపారు. దాదాపు 90 నుంచి 100 మంది ఉగ్రవాదులు మరణించారని వార్తల్లో వస్తుందని చెప్పారు. అయితే అంతకుముందు భారతదేశంలో ఉన్న రోహింగ్యా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశాల వారి లెక్కలు తీసి ఎక్కడివారు అక్కడికి వెళ్లిపోవాలని ఆదేశించారని, దీంతో కొందరు వెళ్లిపోయారు. కానీ హైదరాబాద్ ఓల్డ్ సిటీలో చాలామంది ఇంకా ఉండొచ్చని తెలిపారు. భారతదేశం జిందాబాద్ అని చెప్పే వాళ్లే.. వాళ్లని ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని అన్నారు. దాదాపు 15 వేల నుంచి 20 వేల మంది రోహింగ్యా, బంగ్లాదేశ్, పాకిస్తానీయులు హైదరాబాద్ పార్లమెంట్‌లో తలదాచుకున్నారని, ఎంఐఎం పార్టీ వారికి రక్షణగా ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. వీరందరికి ఆధార్, ఓటర్ కార్డులు ఉన్నాయని, వీటిని గుర్తించడంతో పాటు రద్దు చేసి, వారిని తిరిగి వారి దేశాలకు పంపించాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. దాడుల నేపథ్యంలోనే మన రాష్ట్రాన్ని మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, వీరందరినీ వెంటనే వారి దేశాలకు పంపిస్తే మనల్ని మనం కాపాడుకోవచ్చని సీఎంకు రాజాసింగ్ సూచించారు.

# మరింత భద్రత పెంచండి

## ఈ టైంలో రాజకీయాలకు తావులేదు..

- రౌడీషీటర్లు, పాత నేరస్తుల పట్ల పోలీస్ శాఖ నిఘా
- ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి
- సోషల్ మీడియాలో అసవసరప్రకటనలు చేస్తే కఠిన చర్యలు
- శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలి
- పోలీసు ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు
- సైన్యానికి సంఘీభావంగా నేడు సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ర్యాలీ



**హైదరాబాద్, మహా:** అత్యవసర సర్వీసులు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులు రద్దు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఉద్యోగులు అంతా ప్రభుత్వానికి అందుబాటులో ఉండాలని చెప్పారు. దేశ సైన్యంతో మనమంతా అండగా ఉన్నామనే సందేశం ఇవ్వాలని తెలిపారు. ఈ సమయంలో రాజకీయాలు, పార్టీలకు తావులేదని స్పష్టం చేశారు. మంత్రులు, అధికారులు అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. బుధవారం ఇండియన్ ఆర్మీ పాకిస్తాన్ ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీజీపీ జితేందర్, హోం సెక్రటరీ రవి గుప్తా, ఆర్మీ, పోలీస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇతర సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల రక్షణకు సంబంధించి అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. భారత సైన్యానికి సంఘీభావంగా నేడు సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ర్యాలీ చేపట్టనున్నారు. ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఇతర నేతలు పాల్గొననున్నారు. విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు మీడియా, సోషల్ మీడియాలో అసవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నెంబర్ ఇవ్వాలని అన్నారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి అనధికారికంగా నివసిస్తున్న వారిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలని అన్నారు. బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అత్యవసర మెడిసిన్ సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు.

**ఫేక్ న్యూస్‌పై ఉక్కుపాదం..**

ప్రైవేటు ఆస్పత్రుల్లో బెడ్‌ల అందుబాటుపైన ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాలని చెప్పారు. రెడ్ క్రాస్ సమన్వయం చేసుకోవాలని అన్నారు. ఆహార నిల్వలు తగినంత ఉండేలా చూడాలని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ మీద అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారిపైన ఉక్కు పాదం మోపాలని హెచ్చరించారు. ఫేక్ న్యూస్ వల్ల ప్రజల్లో మరింత ఆందోళన పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఫేక్ న్యూస్‌ను అరికట్టడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కి అనుసంధానం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు సున్నిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండటంతో పాటు భద్రతను పెంచాలని సూచించారు. హైదరాబాద్‌లోని అన్ని విదేశీ రాయబార కార్యాలయాల దగ్గర భద్రతను పెంచాలని ఆదేశించారు. ఐటీ సంస్థల దగ్గర భద్రతను పెంచాలని అన్నారు. హైదరాబాద్ నగరంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అవసరమైతే పీస్ కమిటీలతో మాట్లాడాలని సూచించారు. రౌడీషీటర్లపైన, పాత నేరస్తుల పట్ల పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

# మోగిన జంగ్ సైరన్


- సిటీలో నాలుగు చోట్ల ఆపరేషన్ అభ్యాస్
- పాల్గొన్న పోలీస్, ఫైర్, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది
- ఎయిర్ రైడ్ సైరన్లతో ప్రజల్ని అప్రమత్తం చేసిన అధికారులు
- 54 ఏళ్ల తర్వాత తొలిసారి యుద్ధ సన్నద్ధతపై మాక్ డ్రిల్స్



**హైదరాబాద్, మహా:** 54 ఏళ్ల తర్వాత మహానగరంలో జంగ్ సైరన్ మోగింది. పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత దళాలు పీవోకేతోపాటు పాకిస్థాన్‌లోని తొమ్మిది ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేసిన నేపథ్యంలో నెలకొన్న పరిస్థితులతో బుధవారం హైదరాబాద్‌లో ఆపరేషన్ అభ్యాస్ పేరుతో మాక్ డ్రిల్ నిర్వహించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని నాలుగు చోట్ల జరిపిన ఈ మాక్ డ్రిల్‌లో అత్యవసర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలన్న దానిపై ఆయా శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. అదే సమయంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఎలా స్పందించాలన్నది తెలియ చేశారు. యుద్ధం అనివార్యమైతే ప్రజలు ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి.. పోలీస్, ఫైర్, మున్సిపల్, రెవెన్యూ, మెడికల్ తదితర శాఖల అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టాలన్న దానిపై ఆపరేషన్ అభ్యాస్ పేరుతో మాక్ డ్రిల్ నిర్వహించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. దీంతో హైదరాబాద్‌లోని గోల్కొండ నానల్ నగర్, కాంచన్ బాగ్, సికింద్రాబాద్ షెనాయ్ హాస్పిటల్, ఈసీఐఎల్‌లోని ఎన్ఎఫ్‌సీ వద్ద మాక్ డ్రిల్స్ నిర్వహించారు. సాయంత్రం సరిగ్గా 4 గంటలకు ఆయా చోట్ల సైరన్లు మోగించారు. ఆ వెంటనే ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అందుబాటులో ఉన్న భవనాలు, సెల్లార్లు, సురక్షిత ప్రాంతాలకు వెళ్లేలా చూశారు. వాహనదారులు కూడా తమ తమ వాహనాలను రోడ్డు పక్కన పార్క్ చేసి సురక్షిత ప్రదేశాలకు చేరేలా చర్యలు తీసుకున్నారు. నిజంగా బాంబు దాడులు జరిగి గాయపడినట్లు కొందరు పడిపోగా పోలీస్, ఫైర్, మెడికల్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఎన్సీసీ క్యాడెట్లు వారికి ప్రాథమిక చికిత్స జరిపారు. అనంతరం అంబులెన్సుల్లో వారిని అక్కడి నుంచి తరలించారు.

## ఆందోళన వద్దు..

**మాక్ డ్రిల్ నిర్వహించిన నేపథ్యంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ చెప్పారు. ప్రస్తుతం యుద్ధం వచ్చే పరిస్థితి లేదన్నారు. ఒకవేళ యుద్ధం అనివార్యమైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై సన్నద్ధం కావటానికే ఈ మాక్ డ్రిల్ జరిపినట్లు తెలిపారు.**



# ఉద్రిక్తతలను తగ్గించేందుకు సిద్ధం

## భారత్ ఆశిస్తే ఆ దిశగా చర్యలు చేపడుతాం

### ప్రస్తుత పరిస్థితిని శాంతింప చేసేందుకు ప్రయత్నిస్తాం

### పాకిస్థాన్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై భారత్ సైనిక దాడులు జరపడంపై ఆదేశ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టేందుకు పాకిస్థాన్ సిద్ధంగా ఉందని అన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితిలో ఉద్రిక్తతలను తగ్గించాలని ఇండియా అనుకోవాల్సి ఉంటుందని చెప్పారు. పాకిస్థాన్ ఎలాంటి శత్రుత్వానికి చొరవ తీసుకోదని, రెచ్చగొడితే మాత్రం తగిన విధంగా స్పందిస్తుందని అన్నారు. బ్లూమ్‌బర్గ్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. 'ఇండియాకు వ్యతిరేకంగా పాక్ గత రెండు వారాలుగా ఎలాంటి శత్రుత్వ వైఖరి ప్రదర్శించకుండా నిలకడైన వైఖరితో ఉంది. అయితే మా మీద దాడికి దిగితే తగిన రీతిలో బదులిస్తాం. ఇండియాకు ఒక అడుగు వెనక్కి వేస్తే, మేము కూడా ఉద్రిక్తలు తగ్గించేందుకు సన్నద్ధంగా ఉంటాం'' అని బ్లూమ్‌బర్గ్ టెలివిజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసిఫ్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో దౌత్యపరమైన చర్చలకు ఇరుదేశాలు ఆలోచన చేస్తున్నాయా అని అడిగినప్పుడు, అలాంటిదేమీ తన దృష్టికి రాలేదని ఆసిఫ్ చెప్పుకొచ్చారు.

# పాకిస్థాన్ రివేంజ్

## కశ్మీర్‌లో పాక్ కాల్పులు..

### 15 మంది పౌరుల మృతి.. 43 మందికి గాయాలు



**మహా:** జమ్మూ కశ్మీర్‌లో లైన్ ఆఫ్ కంట్రోల్, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి పాకిస్తాన్ బుధవారం షెల్లింగ్ దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 15 మంది భారతీయ పౌరులు ప్రాణాలు కోల్పోగా, మరో 43 మంది తీవ్రంగా గాయపడ్డారు. పాకిస్తాన్ దాడులకు ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరిట బుధవారం తెల్లవారుజామున 1:05 గంటలకు పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని 25 నిమిషాల పాటు ఖచ్చితమైన దాడులు చేసింది. ఈ దాడులు జైష్ ఏమహమ్మద్, లష్కర్‌ఏతొయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ సహా పలు ఉగ్రసంస్థల శిబిరాలపై జరిగాయి.

**పాక్ దాడులతో కశ్మీర్‌లో విధ్వంసం**


పాకిస్తాన్, పీఓకెలోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడులు ప్రారంభించిన కొన్ని గంటల తర్వాత ఈ దాడులు జరగడం విశేషం. పాకిస్తాన్ భారీ షెల్లింగ్ దాడుల కారణంగా జమ్మూ కశ్మీర్‌లోని పూంచ్, తంగ్ధర్ ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ దాడుల్లో ఎల్ఓసి, సరిహద్దుల వెంబడి ఉన్న గ్రామాల్లోని ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. శిథిలాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కిటికీల సమీపంలో గాజు శకలాలు చిందరవందరగా కనిపించాయి. ఈ దాడుల్లో సామాన్య పౌరులు తీవ్రంగా నష్టపోయారు. ప్రధానంగా పూంచ్ జిల్లాలోని సెంట్రల్ గురుద్వారా శ్రీగురు సింగ్ సభా సాహిబ్‌పై పాక్ దళాలు జరిపిన దాడిలో ముగ్గురు గురుసిఖ్‌లు మరణించారు. శిరోమణి అకాలీ దళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ఈ ఘటనపై Xలో స్పందిస్తూ, మరణించిన వారిలో భాయ్ అమ్రీక్ సింగ్ జీ (రాగీ సింగ్), భాయ్ అమర్‌జీత్ సింగ్, భాయ్ రంజిత్ సింగ్ ఉన్నారని తెలిపారు. శిరోమణి అకాలీ దళ్ మరణించిన గురుసిఖ్‌ల కుటుంబాలకు పూర్తి సంఘీభావాన్ని తెలియజేసింది. ఈ బాధాకర సమయంలో బాధిత కుటుంబాలకు తగిన పరిహారం అందించాలని, వీరి త్యాగాన్ని గౌరవించాలని డిమాండ్ చేసింది.

# ఆర్మీ ధైర్యసాహసాలకు సెల్యూట్

### ఉగ్రవాదుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీశాం

### అమాయక పౌరులను చంపిన వారినే మట్టుబెట్టాం

### కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడి



**ఢిల్లీ:** మన అమాయక పౌరులను చంపిన వారినే మట్టుబెట్టామని, సాధారణ పౌరులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అత్యంత జాగరూకతతో ఈ దాడులు నిర్వహించామని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఆపరేషన్ సింధూర్‌తో పహల్గాం ఉగ్రదాడిలో టూరిస్టులను అత్యంత కిరాతకంగా చంపిన వారికి గట్టి సమాధానమిచ్చామని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మన సైనికులు అద్భుత పరాక్రమం ప్రదర్శించారని కొనియాడారు. 6 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ చేపట్టిన 50 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను రాజ్‌నాథ్ సింగ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలను టార్గెట్ చేసుకుని సాయుధ బలగాలు విజయవంతంగా ఈ ఆపరేషన్ నిర్వహించారని అభినందించారు. 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో మన బలగాలు ఆపరేషన్ సిందూర్ నిర్వహించి ఉగ్రవాద శిక్షణా శిబిరాలను ధ్వంసం చేశాయి. గట్టి బదులిచ్చాయి. కచ్చితమైన ప్రణాళికతో ఇదంతా చేశాం. ఉగ్రవాదుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీశాం. ఈ దాడులను ఉగ్రవాద శిబిరాలు, మౌలిక వసులకే పరిమితం చేశాం. మన సాయుధ బలగాల ధైర్యసాహసాలకు సెల్యూట్ చేస్తున్నాను' అని రాజ్‌నాథ్ అన్నారు.



# భారత సైన్యానికి సెల్యూట్

### మోడీ సర్కార్ దుష్ట శక్తుల అంతు చూస్తుంది

### బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్, మహా:**

ఉగ్రవాదానికి సమాధానంగా ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టిన భారత సైన్యానికి సెల్యూట్ అంటూ బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కొనియాడారు. భారతీయులకు హాని చేయాలని చూస్తే వారెవరైనా సరే.. అలాంటి దుష్ట శక్తుల అంతు మోడీ సర్కార్ చూస్తుందని బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. భారత సైన్యం ఆపరేషన్ సింధూర్‌ను చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. పాకిస్తాన్‌లోని మూడు ఉగ్రవాద సంస్థలకు చెందిన 9 శిబిరాల్లో దాక్కున్న టెర్రరిస్టులను ఆపరేషన్ సింధూర్ ద్వారా హతమార్చడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ తీసుకున్న సాహసోపేత నిర్ణయం ప్రపంచానికే దిక్సూచిగా నిలువనుందన్నారు. సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్న ప్రధాని మోడీకి దేశ ప్రజలంతా అండగా నిలబడాల్సిన అవసరముందన్నారు.



# పిక్చర్ అభీ బాకీ హై

## మాజీ ఆర్మీ చీఫ్ ముకుంద్ ఇంట్రెస్టింగ్ ట్వీట్

### ఉగ్రవాదంపై భారత్ మరిన్ని దాడులు చేయొచ్చని సంకేతాలు

ఢిల్లీ: పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా, భారత భద్రతా దళాలు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై క్షిపణి దాడులు చేశాయి. ఈ దాడుల్లో 100కు పైగా ఉగ్రవాదులు మరణించినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా ఈ ప్రతీకార చర్యపై ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవాణే (ట్విట్టర్)లో 'పిక్చర్ అభీ బాకీ హై' అని పోస్ట్ చేశారు. అంటే ఇంకా సినిమా మిగిలే ఉందని పరోక్షంగా చెప్పారు. అంటే ఉగ్రవాద నిర్మూలన లక్ష్యంగా భారత్ మరిన్ని దాడులు చేయొచ్చని సంకేతాలు ఇచ్చారు.

మహా పత్రిక
ANN తెలుగు
04 | WWW.MAHAADAILY.COM
గురువారం, హైదరాబాద్ | 08-05-2025





## మసూద్ ఇల్లు జైషే హెడ్ క్వార్టర్

బహవల్‌పూర్‌లోని మర్కజ్ సుబాన్. ఇది సరిహద్దుకు 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. జైషే మహ్మద్‌కు దీనిని ఆపరేషనల్ హెడ్‌క్వార్టర్‌గా అభివర్ణిస్తారు. పుల్వామా దాడి సహా భారత్‌పై చాలా కుట్రలు ఇక్కడే పురుడు పోసుకున్నాయి. మసూద్ అజార్ సన్నిహితులు ఈ కేంద్రం నుంచి ఆత్మాహుతి దాడులకు శిక్షణ ఇవ్వడం, ప్లానింగ్ వంటివి చేశారు. దీనిని జైషే చీఫ్ మసూద్ ఇంటిగా కూడా వినియోగిస్తాడు. ప్రస్తుతం జైషే నెంబర్-2గా ఉన్న ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్, మౌలానా అమర్ ఇతరుల కుటుంబసభ్యులు కూడా దీనిలో ఉంటున్నారు. 600 మంది ఉగ్రవాదుల ఇళ్లు కూడా ఈ క్యాంపస్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది.

## హిజ్బుల్ కీలక కేంద్రంలో 25 మంది

సియల్‌కోట్‌లోని మెహ్‌మూనా జోయా క్యాంప్. అంతర్జాతీయ సరిహద్దుకు 15 కి.మీ. దూరంలో ఉన్న హిజ్బుల్ ముజాహిద్దీన్ శిబిరం ఇది. దీనికి చుట్టూ నివాస భవనాలు ఉన్నాయి. దీనికి మోహద్ ఇర్ఫాన్ ఖాన్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇతడు 1995లో జమ్మూలోని మౌలానా ఆజాద్ స్టేడియంలో వరుస పేలుళ్లకు పాల్పడ్డాడు. నాడు గవర్నర్ కేవీ కృష్ణారావు త్రుటిలో ఈ దాడుల నుంచి బయటపడ్డారు. ఈ ఉగ్ర స్థావరంలో దాదాపు 50 మంది ఉండేందుకు వీలుగా ఏర్పాట్లు ఉన్నాయి. ఎల్లప్పుడూ ఇక్కడ దాదాపు 20-25 మంది ఉంటారు.

# పాక్.. చెక్

## ఉగ్రశిబిరాలు.. ఉఫ్

## పక్కాగా లెక్క అప్పగించిన భారత్

## 9 శిబిరాల్లో.. ఏకకాలంలో

ఉరుము ఉరమలేదు. మెరుపు మెరవలేదు. ప్రశాంతంగా నిద్రపోతున్న కాలకేయుల్లాంటి ఉగ్రవాదుల శిబిరాల్లోకి డ్రోన్లు ధామ్మంటూ దూసుకెళ్ళాయి. అర్ధరాత్రి దాడి.. గాఢనిద్రలోకి జారకోగానే భారత ఆర్మీ దీపావళి మోతమోగించింది. భారత్ సహనం నశిస్తే.. ప్రతీకారం ఎలా ఉంటుందో శాంపిల్ చూపించింది. ప్రపంచం మద్దతు పొంది.. ఏ వైపు నుండీ విమర్శ లేకుండా చక్రబంధంలో బిగించి మరీ ఉగ్రవాద శిబిరాలను ఉఫ్ అనేసింది. గత రెండుదశాబ్దాలుగా పెట్రేగిపోతున్న ఉగ్రమూకలను సినీఫక్కీలో లేపేసింది. జరిగిన విధ్వంసానికి పాక్ ఏడుపులు పెడబొబ్బలు పెడుతున్నా ప్రపంచం పట్టించుకోవడం లేదంటే మోదీ ఎంత పర్ ఫెక్ట్ గా ఆపరేషన్ చేశాడో స్పష్టమవుతోంది అమాయకుల ప్రాణాలు తీయడమే కాక.. మీ ప్రధానికి వెళ్లి చెప్పండనడంతో ఇక వారిని ఏమాత్రం ఉపేక్షించకూడదని నిర్ణయించుకొంది. పఠాన్ కోట్ నుంచి రియాసీ దాడి వంటి పెద్ద కుట్రలకు కేంద్రాలుగా నిలిచిన శిక్షణ శిబిరాలను మొత్తంగా నేలమట్టం చేసింది.

- మహా, ప్రత్యేకం

## లష్కరే హెడ్‌క్వార్టర్.. పెద్ద ఉగ్ర యూనివర్సిటీ..

మురిద్కేలోని మర్కాజ్ తోయిబా. సరిహద్దుకు 30 కిలోమీటర్ల దూరంలోని లష్కరే క్యాంపు కార్యాలయం ఇది. దాదాపు 82 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఉగ్ర క్యాంపస్ ఇది. ఇందులో మదర్సా, మార్కెట్ వంటివి కూడా ఉన్నాయి. ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేయడంలో ఈ క్యాంపస్‌దే కీలక పాత్ర. ఇది లష్కరే హెడ్‌క్వార్టర్‌గా పనిచేస్తోంది. దాదాపు 1000 మంది వరకు ఇక్కడ ఉగ్ర శిక్షణ పొందుతున్నారు. దీని నిర్మాణానికి 2000 సంవత్సరంలో అల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ 10 మిలియన్ డాలర్లు డొనేషన్‌గా ఇచ్చాడు. 26/11 ఉగ్రదాడికి పాల్పడిన దుర్మార్గుల్లో ఒకడైన అజ్మల్ కసబ్‌కు ఇక్కడే ఇంటెలిజెన్స్ శిక్షణ ఇచ్చారు. ఈ దాడి కుట్రదారులు డేవిడ్ కోల్‌మన్ హెడ్లీ, తహవ్వూర్ రాణా ఈ కేంద్రాన్ని సందర్శించారు. లష్కరే సిద్ధాంతకర్తలు అమిర్ హమ్జా, అబ్దుల్ రెహ్మాన్ అబ్ది, జాఫర్ ఇక్బాల్ ఈ ప్రాంగణంలోనే నివాసం ఉంటున్నారు. లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్, జకీర్ రహ్మాన్ లఖ్వీలకు ఇక్కడ ఇళ్లు ఉన్నాయి.

## సొరంగాల కేంద్రం.. తెహ్రాకలాన్

తెహ్రా కలాన్‌లోని సర్జల్ క్యాంప్. జైషే మహ్మద్ ఉగ్ర స్థావరం ఇది. దీన్ని కూడా జమ్మూకశ్మీర్‌లోకి ఉగ్రవాదులను పంపించేందుకు ఉపయోగిస్తున్నారు. భారత్‌లోని సాంబా సెక్టార్‌కు కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. భారత్‌లోకి రహస్య సొరంగాలు తవ్వేందుకు ఇది కేంద్రంగా ఉంది. షకర్‌గర్ ప్రాంతాన్ని లష్కరే, జైషేలు సొరంగాల నెట్‌వర్క్‌గా మార్చేశాయి. భారత్‌లోకి ఆయుధాలు, మత్తు పదార్థాలు రవాణా చేసేందుకు ఇది ప్రధాన లాంచ్‌ప్యాడ్. ఇక్కడ కంట్రోల్ రూమ్ కూడా ఉంది. వీటిల్లో హిజ్బుల్ ముజాహిద్దీన్ రేడియో రిసీవర్లు, కమ్యూనికేషన్ సెంటర్లు ఉన్నాయి. జైషే కమాండర్లు ఇక్కడికి వచ్చి వెళుతుంటారు. ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్‌కు ఇక్కడ పారా గ్లైడింగ్‌లో శిక్షణ కూడా ఇచ్చారు. పఠాన్ కోట్ ఎయిర్ బేస్‌పై దాడి చేసిన ఉగ్రవాదులకు జైషే కమాండర్ షాహిద్ లతీఫ్ ఇక్కడే బ్రెయిన్ వాష్ చేశాడు.

## లష్కరే లాంచ్ ప్యాడ్..

బర్నాలలోని మర్కాజ్ అహ్లే హదిత్ ఉగ్ర స్థావరం. ఇది లష్కరే తోయిబా ఉగ్ర క్యాంప్. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని భింబెర్ జిల్లాలో ఉంది. ఇక్కడ 150 మందికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు ఉన్నాయి. ఎప్పుడూ కనీసం 40 మంది ఉంటారు. ఈ కేంద్రాన్ని లష్కరే కమాండర్ ఖాసీం గుజ్జర్, అనాస్‌జరార్ నిర్వహిస్తున్నారు. పూంఛ్‌రాజౌరిరియాసీ సెక్టార్‌లోకి లష్కరే ఉగ్రవాదులు, ఆయుధాలను పంపించేందుకు దీన్ని వినియోగిస్తున్నట్లు సమాచారం.

## జైషే ఆయుధాగారం..

కోట్లిలోని మర్కాజ్ అబ్బాస్ ఉగ్ర స్థావరం. నియంత్రణ రేఖకు 35 కి.మీ. దూరంలో ఈ క్యాంప్ ఉంది. కోట్లీ మిలిటరీ క్యాంప్‌నకు కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో దీనిని నిర్వహించడం గమనార్హం. ఇక్కడ 125 మంది శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు ఉన్నాయి. ఏ సమయంలోనైనా కనీసం 50 మంది ఉంటారు. హాఫీజ్ అబ్దుల్ షకూర్ అలియాస్ ఖారీజరార్ ఈ కేంద్రానికి హెడ్. జైషే వ్యవస్థాపక సభ్యుల్లో ఒకడు. గతంలో హర్కత్ ఉల్ ముజాహిద్దీన్‌లో పనిచేశాడు. 2016 నగ్రోటాలోని బాలెనీ ఆర్మీ క్యాంప్‌పై దాడిలో ఇతడి హస్తం ఉన్నట్లు ఎన్ఐఏ వెల్లడించింది. పఠాన్‌కోట్ ఉగ్రదాడి తర్వాత జైషే తన ఆయుధాలు, మందుగుండును దశాకా మర్కజ్ నుంచి తరలించి ఇక్కడ నిల్వ చేయడం మొదలుపెట్టింది. అవసరమైనప్పుడు షకూర్ స్వయంగా ఆయుధాలను తన వాహనంలో సియాల్‌కోట్‌కు తరలిస్తాడు. 2023 ఏప్రిల్ 20న పూంఛ్‌లో జరిగిన దాడులకు, జూన్ 24న బస్సులో ప్రయాణిస్తున్న అమాయక యాత్రికులపై దాడికి ఇక్కడి ఉగ్రవాదులే కారణం అని సమాచారం.

## ఉగ్రవాదులకు పర్వత యుద్ధతంత్రంలో ఇక్కడే శిక్షణ..

కోట్లిలోని మస్కర్ రహీల్ షహీద్. పీఓకేలో హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన స్థావరం ఇది. దాదాపు 200 మందికి ఉగ్ర శిక్షణ ఇచ్చేలా దీనిని నిర్మించారు. ప్రస్తుతం అక్కడ 30 మంది వరకు ఉండొచ్చని అంచనా. తుపాకీల వినియోగం, శారీరక దృఢత్వంపై శిక్షణ ఇస్తారు. దీంతోపాటు బోర్డర్ యాక్షన్ టీమ్, స్నైపింగ్ టెక్నిక్‌లు కూడా నేర్పిస్తారు. ఉగ్ర విద్యార్థులను కొండల్లోకి తీసుకెళ్లి.. పర్వత యుద్ధ తంత్రాల్లో శిక్షణ ఇస్తారు. హిజ్బుల్ చీఫ్ సయ్యద్ సలాహుద్దీన్ దీనికి అధిపతి. అతడే కొత్త ఉగ్రవాదులకు ఇక్కడ స్వాగతం పలుకుతాడని పేరుంది. అంతేకాదు శిక్షణను కూడా అతడే పర్యవేక్షిస్తాడు. కొండల ప్రాంతంలో ఉండే ఈ క్యాంప్‌లో నాలుగు గదులు, బ్యారక్‌లు ఉన్నాయి. వీటిలో పెద్దఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రి ఉన్నట్లు సమాచారం. వీటితోపాటు ఉగ్రవాదులకు బ్రెయిన్ వాష్ చేసేందుకు అవసరమైన ప్రచార సామగ్రి పెద్దఎత్తున ఇక్కడ నిల్వ చేస్తారు.

## లష్కరే శిక్షణ కేంద్రం..

ముజఫరాబాద్‌లోని షవాయ్ నాలా క్యాంప్. ఇది 2000 సంవత్సరం నుంచి పనిచేస్తోంది. దీనికి హుజైఫా బిన్ యెమెన్, బైత్ ఉల్ ముజాహిద్దీన్ అనే పేర్లు కూడా ఉన్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తంగ్ధర్ సెక్టార్‌లో సరిహద్దుకు 30 కిలోమీటర్ల పరిధిలో షవాయ్ లష్కరే క్యాంప్ ఉంది. ఈ ముఠాకు కీలకమైన క్యాంప్ ఇది. లష్కరే కమాండర్ అబు దుజానా దీనికి ఇన్‌ఛార్జి. పెద్దఎత్తున లష్కరే క్యాడర్ ఇక్కడ నివాసం ఉంటోంది. వీరిలో కమాండర్లు, శిక్షకులు ఉన్నారు. లష్కరేలో చేరిన వారిని ఇక్కడ తరచూ హాఫీజ్ సయీద్ వచ్చి ఆహ్వానం పలుకుతాడు. ఇక్కడ అత్యధికంగా 250 మందికి ట్రైనింగ్ ఇచ్చేలా ఏర్పాట్లు ఉన్నాయి. ఎప్పుడూ 50100 మంది ఉంటారు. ఫిజికల్ శిక్షణతోపాటు.. జీపీఎస్ వాడటం, మ్యాప్ రీడింగ్, ఆయుధ వినియోగం, ప్రత్యేకమైన ఆయుధాల వాడకంపై శిక్షణ ఇస్తారు. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ కార్యకలాపాలు కూడా ఇక్కడ చురుగ్గానే ఉంటాయి. వీరికి అవసరమైన ఆయుధాలను పాక్ సైన్యం సమకూరుస్తుంది. 26/11 ఉగ్ర దాడుల్లో పాల్గొన్న కసబ్ ఇక్కడ కూడా శిక్షణ పొందాడు.





## పాక్ ఎస్ఎస్‌జీ కమాండోలతో శిక్షణ

ముజఫరాబాద్‌లోని సైద్నా బిలాల్ ఉగ్ర స్థావరం. పీఓకేలోని జైషే ప్రధాన కేంద్రాల్లో ఇది ఒకటి. ముఫ్తీ అస్గర్ ఖాన్ కశ్మీరీ దీనికి అధిపతి. భారత్ నుంచి పారిపోయిన.. ఆసిక్ నెంగ్రూ, జైషే కమాండర్ అబ్దుల్ జిహాదీలు కూడా ఈ క్యాంప్‌ను వాడుకొన్నారు. ముజఫరాబాద్ రెడ్‌ఫోర్ట్‌కు ఎదురుగా ఉంటుంది. ఇక్కడికి వచ్చేవారికి పాక్ ఎస్ఎస్‌జీ కమాండోలు శిక్షణ ఇస్తారు. జమ్మూకశ్మీర్‌లోకి ఉగ్రవాదులను తరలించేందుకు వీలుగా దీన్ని రవాణా క్యాంప్‌గా నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎప్పుడూ 50100 మంది ఉగ్రవాదులు ఉంటారని సమాచారం.

# భారతమాత నుదుటిపై సింధూరం

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### ఇండియన్ ఆర్మీని చూసి గర్వపడుతున్నాం



**షాద్ నగర్,మహా:** భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్పందించారు. తీవ్రవాద శిబిరాలను పూర్తిగా తుడిచిపెట్టే శక్తి ఆర్మీకి ఉందని ఇండియన్ ఆర్మీని చూసి గర్విస్తున్నానని ఎమ్మెల్యే శంకర్ స్పష్టం చేశారు. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ మన భారతమాత నుదుటిన ఉన్న సిందూరం అని ఇది మొదటి శుభసంకేతమని ఆయన పేర్కొన్నారు. జమ్ము కశ్మీర్లోని పహల్గామ్ ఉగ్రదాడిపై భారత్ ప్రతీకారం తీర్చుకుందనీ ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్లోని ఉగ్రవాద స్థావరాలపై ఇండియన్ ఆర్మీ మెరుపుదాడులకు దిగడం పాకిస్తాన్ ఇలాంటి ఉగ్రవాద దేశానికి చెంపపెట్టు లాంటిదని అన్నారు. ఈ దాడుల్లో 30 మంది ఉగ్రవాదులు హతమైనట్లు తెలుస్తోందని ఇక ఆపరేషన్ సిందూర్‌ను ప్రతీఒక్కరూ సమర్థిస్తున్నారని ఎమ్మెల్యే తెలియజేశారు. అధికార విపక్ష నేతలు, భారత ప్రజలు ఇతర అగ్ర దేశాల నాయకులు సైతం అందరూ కూడా ఆపరేషన్ సింధూర్‌ను సమర్థిస్తూ జైహింద్ అంటూ పోస్టులు పెడుతున్నారన్నారు. ఇండియన్ ఆర్మీ మెరుపు దాడులపై స్పందిస్తూ ఎమ్మెల్యే శంకర్ భారత దేశ ఆర్మీకి సెల్యూట్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని కోరారు. నియోజకవర్గ ప్రజల తరపున ఆర్మీకి, ప్రభుత్వానికి ఆయన అభినందనలు తెలిపారు..

# భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

### భూ సమస్యలను అధికారులు వెను వెంటనే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




**కరీంనగర్, మహా:** కరీంనగర్, భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా పైలట్ మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సుల్లో భాగంగా బుధవారం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఎక్లాస్ పూర్, రాయికల్ గ్రామాలలో గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన సదస్సులకు కలెక్టర్ హాజరయ్యారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించి, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే అన్ని మండలాల్లో నూతన చట్టం గురించి అవగాహన కల్పించామని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సైదాపూర్ మండలాన్ని పైలెట్ ప్రాతిపదికన ఎంపిక చేసి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్‌బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. భూభారతి కొత్త ఆర్.ఓ.ఆర్ చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. వివిధ కారణాల వల్ల రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు సమర్పించే అవకాశం లభించని వారు తరువాత కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, అధికారులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. భూ భారతి పోర్టల్ ద్వారా ఆన్లైన్ కూడా అప్లై చేసుకోవచ్చని అన్నారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్ణీత ప్రొఫార్మా లో ప్రింట్ చేసిన దరఖాస్తులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని కలెక్టర్ కోరారు. భూ సమస్యలను పరిష్కరించుకుని, భూ వివాదాలు లేని గ్రామాలుగా పల్లెలను తీర్చిదిద్దుకోవాలని సూచించారు.

# దేశ సమగ్రత కోసం జరిగే యుద్ధంలో మేము మీ వెంటే ..!

### శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు

షాద్ నగర్ నియోజకవర్గ పర్యటనలో స్పష్టీకరణ

షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో కలిసి పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల పర్యటన



**షాద్ నగర్,మహా:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ మండలాల్లోని పలు గ్రామాల్లో నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐదు కోట్ల రూపాయల నిధులతో అంగన్వాడీ భవనాలు, గ్రామపంచాయతీ భవనాలను, కొత్తూరు మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నిర్మించారు. ఈ నూతన భవనాల ప్రారంభోత్సవానికి ఐ.టి శాఖ మంత్రి శ్రీధర్ బాబు, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రి శ్రీధర్ బాబు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..... దేశ ప్రజల సంరక్షణ బాధ్యత, సమగ్రత ప్రతి ఒక్కరిపై ఉంటుందని, దేశ సైన్యం చేస్తున్న చర్యలకు రాష్ట్ర ప్రజలతోపాటు, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. దేశాన్ని కాపాడే ప్రయత్నంలో సైన్యం చేస్తున్న సాహసానికి సెల్యూట్ అన్నారు. సైన్యం తీసుకునే ఏ చర్యకైనా మా నాయకుడు రాహుల్ గాంధీ తో పాటు, తాము వెన్నంటే ఉంటామన్నారు.



### అగ్ని ప్రమాదంలో కొరియోగ్రాఫర్

# వీరారెడ్డి మృతి

**రాజేంద్రనగర్, మహా :** నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ కుతుబ్ అర్కేబ్ అపార్ట్మెంట్ ప్లాట్ 4వ అంతస్తులో అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు షెలరేగడంతో మంటల్లో చిక్కుకున్న వీరారెడ్డి ని అపార్ట్మెంట్ వాసులు కాపాడే ప్రయత్నం చేశారు, కొరియోగ్రాఫర్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలో చిక్కుకొని ఊపిరి ఆడక సజీవ దహనమయ్యాడు. పక్క రూమ్ లో వీరారెడ్డి తల్లిదండ్రులతో పాటు అన్న పిల్లలు ఉంటున్నారు. మంటలను గమనించిన స్థానికులు వీరారెడ్డి తల్లిదండ్రులతోపాటు అన్న పిల్లలను కాపాడగలిగారు. అపార్ట్మెంట్ వాసులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఫైర్స్ సిబ్బందితో కలిసి మంటలను అదుపులోకి తెచ్చారు. వీరారెడ్డి సజీవ దహనానికి పలు అనుమానాలు స్థానికులు వ్యక్తపరిచారు. నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రొసీడింగ్ కాపీలను త్వరగా అందజేయండి

### బల్దియా కమిషనర్ డా అశ్విని తానాజీ వాకడే.. టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం



**వరంగల్, మహా;** ఎల్ ఆర్ ఎస్ ప్రొసీడింగ్ కాపీలను త్వరగా అందజేయాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయం లో టౌన్ ప్లానింగ్ అధికారులతో జరిగిన సమావేశం లో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ ల్యాండ్ రెగ్యులేషన్ స్కీమ్ ద్వారా 30,500 దరఖాస్తులను ప్రాసెసింగ్ చేయడం ద్వారా బల్దియా కు సుమారు రూ.130 కోట్ల ఆదాయం సమకూరిందని, డబ్బులు చెల్లించిన దరఖాస్తు దారులకు క్రమబద్దీకరణకు చెందిన ప్రొసీడింగ్ లను అందజేయాలని అన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నగర వ్యాప్తం గా శిథిలావస్థ లో ఉన్న భవనాలను గుర్తించి నోటీసులు అందజేయాలని సూచించగా, ఇప్పటివరకు 348 భవనాలకు నోటీసులు అందజేసినట్లు సిటీ ప్లానర్ తెలిపారు. బడా భవనాలలో ఉన్న సెల్లార్ లలో ఏమైన నిర్మాణాలు ఉంటే తొలగింపు, ఖాళీ చేయించాలని సెల్లార్ లలో ఉండే ఎలక్ట్రికల్ డివైజ్ లు మొదటి అంతస్తులో ఉండేలా చూడాలని, మోటార్ పంపు సెట్ లను అందుబాటులో ఉంచాలని, టిజి బిపాస్ లో బిల్డింగ్ పర్మిషన్ లను నిర్దిష్ట గడువు లోగా అనుమతిలు మంజూరు జరిగేలా చూడాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏ సి పి లు శ్రీనివాస్ రెడ్డి, రజిత, ఖలీల్, నస్రీన్, టి పి ఎస్ లు రోజా రెడ్డి, సుమన, శ్రీకాంత్, తదితరులు, పాల్గొన్నారు.



### బండ్లగూడ జాగిర్ మున్సిపల్

# కార్పొరేషన్ అభివృద్ధిలో దూసుకుపోతుంది

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, మహా :** బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గందంగూడ లో శ్రీ జ్ఞాన వేంకటేశ్వర స్వామి దేవాలయ వార్షికోత్సవంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాగర్ గౌడ్, రాజేందర్ రెడ్డి తో కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రభుత్వ పెద్దల సహాయంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాము. భవిష్యత్తులో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్



**వరంగల్, మహా;** వరంగల్ మహానగర పాలక సంస్థ 16వ డివిజన్ పరిధిలోని గరీబ్ నగర్ లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు సానిటేషన్ మంచినీటి సమస్యలపై కార్పొరేటర్ సుంకరి మనీషా శివకుమార్ స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్థానికంగా మంచినీటి సమస్యలు ఉంటే వెంటనే తెలియపర్చాలని వాటర్ మెన్ కు సూచించారు. పలు కాలనీలలో జరుగుతున్న డ్రైనేజీ కాలువల నిర్మాణ నాణ్యతను పరిశీలించి పనులు నాణ్యతను పాటించి సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో గరీబ్ నగర్ బీ.ఆర్.యస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మున్సిపల్ జవాన్,వాటర్ మెన్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

# భారతదేశ ప్రజలను గర్వపడేలా చేసిన సైన్యానికి సెల్యూట్

### ఆపరేషన్ సింధూర్ పై హర్షం వ్యక్తం చేసిన కార్పొరేటర్ ఆకుల శ్రీ వాణీ

ఉగ్రవాదులకు, దేశద్రోహులకు మన దేశంలో స్థానం లేదు

పాకిస్తాన్ జెండాకు చెప్పుల దండ, కోడిగుడ్ల, టమాటాలు, పేడా నీళ్ల



**బాలాపూర్ మహా:** పాకిస్థాన్ లోని ఉగ్రవాద స్థావరాల పై భారత్ సైన్యం ఆపరేషన్ సింధూర్ పేరిట ఉగ్ర స్థావరాల పై దాడులు స్వాగతిస్తూ సరూర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఆధ్వర్యం లో పాకిస్తాన్ జెండాకు చెప్పుల దండ వేసి,కోడిగుడ్ల, టమాటాలు ,పేడా నీళ్ల తో పాటు పాకిస్తాన్ జాతీయ జెండాను రోడ్డు పై తొక్కుతూ భారత సైన్యం సాధించిన విజయాన్ని గర్విస్తూ పటాసులు కాలుస్తూ బీజెపి శ్రేణులు ఆనందం వ్యక్తం చేశారు. పాకిస్తాన్ చేసే దాడి కి ,ప్రతిదాడి తీవ్రంగా ఉంటుందని ఆకుల శ్రీ వాణీ హెచ్చరించారు. భవిష్యత్తులో దాయాది దేశం మన పై ఏ రకమైన దాడులు చేయాలన్న భయపడే విధంగా ప్రతి దాడి ఉంటుందని ఇది కేవలం శాంపిల్ మాత్రమేనని అన్నారు. భారతదేశ ఆడబిడ్డల సింధూరని చెడిపిన ఉగ్రవాదులకు ఇక చుక్కలే కనపడతాయని ఉగ్రవాద స్థావరాల పై భారత సైన్యం జరిపిన దాడి చూసి ఉగ్రవాదులు వనికిపోతున్నారని అన్నారు. భారతదేశంలో ఉన్న దేశద్రోహులకు ఇదొక గుణపాఠం అనే హెచ్చరించారు. భారతదేశం లో ఉంటూ భారత దేశానికి వ్యతిరేకంగా ఉన్నవారు పాకిస్తాన్ కు వెళ్ళిపోవాలని ఇక్కడ ఉంటూ పాకిస్తాన్ జిందాబాద్ అనే వారిని వదిలి పెట్టి ప్రసక్తే లేదని అన్నారు. భారత దేశ సైన్యాన్ని చూసి దేశం ఉప్పొంగిపోతుందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సరూర్ నగర డివిజన్ అధ్యక్షుడు బీజెపి నేతలు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# భద్రతా వలయంలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్

**రాజేంద్రనగర్, మహా:** ఇండియా పాకిస్తాన్ యుద్ధ నేపథ్యంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఐదు అంచల భద్రతను ఏర్పాటు చేశారు. సిఐఎస్ఎఫ్ బలగాలతో ఎయిర్పోర్ట్ లోని పలు ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. వచ్చే పోయే ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించి అనుమతిస్తున్నారు. సిఐఎస్ఎఫ్ బలగాల తో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రాంతాన్ని పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.

# చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

**వరంగల్ మహా;** ఇండియన్ మెడికల్ అసోసియేషన్, వరంగల్ వారి ఆధ్వర్యంలో ఎంజీఎం ఆసుపత్రి క్యాజువాలిటి, ఐఎంఏ హోల్ ముందు చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ కె నాగార్జున రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కె కిషోర్ కుమార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంజీఎం ఆసుపత్రికి వచ్చే రోగులకు, అలాగే వరంగల్ కు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు గాను వేసవిలో ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని చలివేంద్రాన్ని ఏర్పాటుకు ఐఎంఏ వరంగల్ వారు ముందుకు రావడం అభినందనీయమని డాక్టర్ కాళీ ప్రసాద్, డా విజయచందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ అజిత్ మహమ్మద్, ఫైనాన్స్ సెక్రటరీ డాక్టర్ శిరీష్ కుమార్, ఐఎంఏ మాజీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కాళీప్రసాద్ , ఇండియన్ రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ డా విజయచందర్ రెడ్డి , బిల్డింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ బందెల మోహన్, ఎంజీఎం ఆర్ఎంవో డా శశి కుమార్ ,డా ప్రసన్న , డా ప్రతాప్,డా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్ నుంచి ఎయిర్ ఇండియా విమాన సర్వీసులు నిలిపివేత

**రాజేంద్రనగర్, మహా :** ఇండియా పాకిస్తాన్ యుద్ధ నేపథ్యంలో ఎయిర్ ఇండియా కంపెనీ బుధవారం నుండి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి జమ్మూ, శ్రీనగర్, లేహ్, జోద్పూర్, అమృత్సర్, భుజ్, జాంనగర్, చండీగఢ్, రాజ్కోట్ ప్రాంతాలకు తమ విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు ఎయిర్ ఇండియా ట్విట్టర్ పోస్ట్లలో తెలిపింది. అమృత్సర్ నుండి విదేశాలకు వెళ్లే రెండు అంతర్జాతీయ విమానాలను ఢిల్లీ కి అధికారులు మార్చారు. ప్రస్తుత నేపథ్యంలో యుద్ధమేఘాల పరిస్థితుల్లో ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నట్టు ప్రయాణికులకు జరుగుతున్న అసౌకర్యానికి చింతిస్తున్నట్లు ఎయిర్ ఇండియా తెలిపింది.

### భారత సాయుధ దళాల పనితీరును

# చూస్తుంటే గర్వంగా ఉంది

### పహల్గం ఉగ్రదాడితో దేశం మొత్తం కన్నీళ్లు కార్చింది

నేడు సాయుధ దళాల పోరాటపటిమను చూస్తూ సంతోషిస్తుంది

దేశ రక్షణలో సైనికులది వెలకట్టలేని పాత్ర.. మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్



**షాద్ నగర్,మహా:** ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్రవాద నిర్మూలనే లక్ష్యంగా భారత సాయుధ దళాలు జరుగుతున్న దాడులను చూస్తుంటే చాలా గర్వంగా ఉందని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అభిప్రాయపడ్డారు. పహల్గం ఉగ్రదాడితో అమాయక దేశ ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, ఆ బాధతో దేశ మొత్తం కన్నీరు పెట్టిందని గుర్తుచేశారు. ఆ దాడికి ప్రతీకారంగా దేశ సాయుధ దళాలు ఉగ్రవాదుల స్థావరాల నిర్మూలనకు ఆపరేషన్ సింధూర్ పేరు తో తమదైన శైలిలో దాడులకు పాల్పడడానికి చూసి దేశ ప్రజలు సంతోషిస్తున్నారని చెప్పారు. నాటి నుంచి నేటి వరకు దేశ రక్షణలో సైనికుల పాత్ర వెలకట్టలేనిదని, సాయుధ దళాల పోరాటపటిమా దేశ ప్రజలకు గర్వకారణమని అభిప్రాయపడ్డారు. ఆపరేషన్ సింధూర్ పేరుతో చేపట్టిన దాడులతో ఉగ్రవాదం పూర్తిస్థాయిలో కనుమరుగు కావాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**బాలాపూర్ మహా:** మహేశ్వరం నియోజకవర్గం లోనీ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లో ప్రజాభవన్ లో 127 మంది అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ్ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాల కింద ఆర్థిక సహాయం అందిస్తూ చెక్కులను పంపిణీ చేశారు మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రా రెడ్డి. అనంతరం మాట్లాడుతూ... సామాజిక న్యాయం సాధనలో భాగంగా అర్హులైన కుటుంబానికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. పేద కుటుంబాల కుమార్తెల పెళ్లిళ్ల కు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచే ఈ పథకాలు ఎంతో మంది జీవితాల్లో వెలుగు నింపుతున్నాయని ఇప్పుడున్న రేవంత్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీలు కూడా సరిగ్గా నెరవేర్చడం లేదని ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరేవరకు ప్రజల పక్షాన పోరాడుతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు,బాలాపూర్ మండల తహసిల్దార్ ఇందిరా దేవి,మున్సిపల్ కమిషనర్,భాగ్యనగర్ రైతు సహకార బ్యాంక్ చైర్మన్ మర్రి నరసింహారెడ్డి,అనుబంధ సంఘాల అధ్యక్షులు,మహిళా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# పలు ప్రాంతాల్లో మార్క్ డ్రిల్...



**రాజేంద్రనగర్, మహా :** రాజేంద్రనగర్ పరిధిలోని నెక్నంపూర్, నార్సింగీ, శంషాబాద్ ప్రాంతాలలో డిసిపి, ఏసిపి, ఎమ్మార్వో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, స్టేషన్ ఎస్హెచ్ఓలు, తో కలిసి బుధవారం పలు ప్రాంతాల్లో మార్క్ డ్రిల్ నిర్వహించారు. ఇండియా పాకిస్తాన్ యుద్ధ నేపథ్యంలో యుద్ధ సైరన్ మో గగానే అత్యవసర పరిస్థితిని అనుకరించి, ఎక్కడ వారు అక్కడే తలదాచుకోవాలి, రోడ్డుపై వెహికల్ లైట్లను ఆఫ్ చేసి మెల్లగా నడపాలి. అత్యవసర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి అనే శిక్షణను నిర్వహించడం. అత్యవసర పరిస్థితులకు సంబంధించిన సమర్థవంతమైన స్పందనను ప్రజలు తెలుసుకోవాలి. మాక్ డ్రిల్ ద్వారా, ప్రజలు, సంస్థలు అత్యవసర సేవల సిబ్బంది ఎలా స్పందించాలో తెలుసుకోవచ్చు, వారి సమన్వయాన్ని మెరుగుపరుచుకోవచ్చు వాస్తవ పరిస్థితులలో సమర్థవంతంగా స్పందించడానికి సిద్ధంగా ఉండవచ్చు. శత్రుదేశం మనపై బాంబుల దాడి జరిపినప్పుడు యుద్ధ సైరన్ మోగుతుంది. వెంటనే ప్రజలు అప్రమత్తమై తన బంకర్ లోకి ఇండ్లలోకి వెళ్లి ప్రాణాలను కాపాడుకోవాలి, గ్యాస్ సిలిండర్లు, కరెంటును ఆఫ్ చెయాలి.మాక్ డ్రిల్ యొక్క లక్ష్యం, అత్యవసర పరిస్థితులకు సంబంధించి ప్రజలు, సంస్థలు అధికారుల సమర్థతను పెంచడం, వారి సమన్వయాన్ని మెరుగుపర్చడం ప్రాణాలను రక్షించుకోవడం కోసం యుద్ధ సమయాలలో సైరన్ మగడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

# అక్రమ వలసదారులను గుర్తించి తరిమేయాలి

### భగత్ సింగ్ నగర్ లో బంగ్లాదేశ్ అక్రమ వలస దారులను గుర్తించాలని సరూర్ నగర్ మండల తహశీల్దార్ కు ఫిర్యాదు.. దేశ భద్రతకు వారి నుండి ముప్పి ఉందన్న బీజేపి నేతలు



**బాలాపూర్ మహా:** రాష్ట్రంలో,హైదరాబాద్ లో ఉన్న అక్రమ వలసదారులను గుర్తించి,తక్షణమే వారిని వారి దేశాలకు తరిమేయాలని బీజెపి నేతలు డిమాండ్ చేశారు. సరూర్ నగర్,భగత్ సింగ్ నగర్ లో బంగ్లాదేశ్ అక్రమ వలస దారులను గుర్తించాలని బుధవారం సరూర్ నగర్ మండల తహశీల్దార్ కు బీజేపీ శ్రేణులతో కలిసి రంగారెడ్డి జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యులు బెంగరబోయిన సురేష్ ,జిల్లా ఉపాధ్యక్షులు ఆరుట్ల సురేష్ పిర్యాదు చేసారు. దేశం లో ఉన్న యుద్ధ వాతావరణంలో అంతర్గత భద్రతకు ముప్పు రాకుండా అక్రమ వలస దారులను వెంటనే చర్యలు కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 200 మందికి పైగా వలసదారులను గుర్తించి పంపినప్పటికి సరూర్ నగర్,భగత్ సింగ్ నగర్ లో బంగ్లాదేశీయులు ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం కాకుండా దేశ భద్రత దృష్టిలో పెట్టుకుని వీరందరినీ తరిమివేయాలని కోరారు.ఆపరేషన్ సింధూర్ కేవలం ఒక ట్రైలర్ మాత్రమేనని తన వక్రబుద్ధిని మార్చుకోకపోతే ప్రపంచ పటం లో పాకిస్తాన్ కనుమరుగవుతుందని హెచ్చరించారు. గతంలో సరూర్ నగర డివిజన్ లో బంగ్లాదేశ్ యూత్ అసోసియేషన్ పేరు తో ఏర్పాటు చేసిన బ్యానర్లు తో దేశ వ్యాప్త చర్చ జరిగిందని అన్నారు. ఈ డివిజన్ లో అనేక అక్రమ మదర్సాలు ఏర్పాటు చేసి అనేక మంది అక్రమ విదేశీ దారులు చొరబడి అందులో చదువుకుంటున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం బీజెపి నేతలు,తదితరులు పాల్గొన్నారు.





# అధ్యక్ష పదవుల కోసం దరఖాస్తులు పెట్టుకోండి

## కాంగ్రెస్ శ్రేణులకు పరిశీలకులు తాహెర్ బిన్ హందన్ సూచన

ఆదిలాబాద్ కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశానికి చిట్ల సత్యనారాయణ తో కలిసి హాజరు

పార్టీకోసం కష్టపడేవారినే పదవులు వరిస్తాయి.. పార్టీ బలోపేతమే అందరి లక్ష్యం కావాలి

అందుకోసం కలిసికట్టుగా పని చేయాలి.. నాయకులు కార్యకర్తలకు దిశానిర్దేశం

**ఆదిలాబాద్ మహా :** పార్టీ కోసం కష్ట పడేవారికి పదవులు వెతుక్కుంటూ వస్తాయని ,జెండా మోసిన కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షులు పరిశీలకులు , ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని తరగింణి ఫంక్షన్ హాల్లో అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన జరిగిన అసెంబ్లీ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మరో పరిశీలకులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్య నారాయణ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ఎంతో చరిత్ర కలిగి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ అని తాహెర్ బిన్ హందన్ తెలిపారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి పునర్ వైభవం తీసుకురావాలనే ఉద్దేశంతో గ్రామ , మండల, బ్లాక్ , పట్టణ , జిల్లా అధ్యక్ష పదవులను భర్తీ చేసేందుకు ఆశావహుల నుండి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. పార్టీలో ఉంటూ పార్టీకోసం కష్టపడే నాయకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రతీ పదవికి ఐదు చొప్పున అప్లికేషన్లు స్వీకరించి అధిష్టానానికి పరిశీలనకు పంపుతామన్నారు.అనంతరం అధిష్టానం నిర్ణయం మేరకు పదవుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందన్నారు. దరఖాస్తుతో పాటు ప్రతీ నాయకుడు మూడు ఫోటోలు,ఓటర్ ఐడీ కార్డ్ , ఆధార్ జిరాక్స్ జిరాక్స్ తో పాటు పూర్తి బయోడేటాను సమర్పించాలని కోరారు. నాయకులు పదవులు కోసం కాకుండా పనిలో పోటీ పడాలని పార్టీకోసం పని చేయాలని అప్పుడు మంచి కార్యకర్తగా గుర్తింపు వస్తుందన్నారు.పార్టీ ఆదేశాను సారం పని చేయాలని పార్టీ సిద్ధాంతాలకు భిన్నంగా కార్యకర్తల ప్రవర్తన ఉంటే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.పార్టీ విషయంలో ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ కాదని పార్టీకి అందరూ సమానమే అన్నారు. పార్టీ పటిష్టతే అందరి లక్ష్యంగా ఉండాలని అన్నారు.ఎవరి మనసులో ఏదైనా కల్మషముంటే వెంటనే దాన్ని తొలగించుకోవాలన్నారు. అంతా ఒకటై పార్టీ బలపేతం పై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం అటు కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడం లక్ష్యంగా ప్రతీ కాంగ్రెస్ నాయకుడు కార్యకర్త సైనికుల వలే పని చేయాలని సూచించారు.అనంతరం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పరిశీలకులు చిట్ల సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ ప్రక్షాళన కోసమే విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పెద్దల ఆదేశానుసారం జిల్లాలో పార్టీని తిరిగి పటిష్ట స్థితికి చేర్చేందుకు ఈ కార్యక్రమానికి వచ్చినట్టు ఆయన తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ సీట్లు సాధించడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు .గాంధీ భవన్ లో జరిగిన మీటింగ్ లో అధిష్టానం సూచనల ప్రకారం పార్టీ పునర్ వైభవం కోసం పార్టీ ప్రక్షాళన చేపడుతుందన్నారు. ఇందుకోసం ప్రతి జిల్లాకు ఇద్దరు పరిశీలకులను పార్టీ అధిష్టానం పంపినట్టు ఆయన తెలిపారు .అందులో భాగంగానే ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజక వర్గంలో అధ్యక్ష పదవుల భర్తీ పై దృష్టి పెట్టినట్టు వివరించారు. తాము ఎంపిక చేసేవారం కాదని కేవలం పరిశీలకులం మాత్రమే అన్నారు. ఇక్కడి దరఖాస్తులను స్వీకరించి అధిష్టానం పరిశీలనకు చేరవేస్తామన్నారు.

బూత్ స్థాయి నుండి పార్టీ బలో పేతం కావాలంటే ముందుగా అధక్షపదవుల ఎంపిక చేయాల్సి ఉందన్నారు. అందుకే అర్హుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్టు తెలిపారు. పార్టీ కష్టపడి పని చేసే వారిని వదులుకోదని అలాంటి నాయకులుగా ప్రతి ఒక్కరు ఎదగాలన్నారు. కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని కాపాడుకుంటూ పార్టీ పటిష్టతకు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. సన్నబియ్యం , 500లకే గ్యాస్ సిలిండర్ , రెండువందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ , మహిళలకు ఫ్రీ బస్ లాంటి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం సభకు అధ్యక్షత వహించిన అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటు పడే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. గతంలో చేసిన తప్పులను సరిదిద్దుంటూ పార్టీ బలోపేతం కోసం కలిసికట్టుగా పని చేస్తామన్నారు.తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకుపోతున్నామన్నారు.మండల గ్రామ బూత్ స్థాయిలో నాయకులు కార్యకర్తలను కలుపుకొని పార్టీని బలోపేతం చేస్తామన్నారు. వచ్చే ఎన్నికలేవైనా కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగించేలా అంతా కలిసి కష్ట పడుదామని ఆయన శ్రేణులకు పిలుపునిచ్చారు. పదవులు ఎవరికి వచ్చినా అందరి లక్ష్యం పార్టీ పటిష్టతే కావాలని అందుకోసం అందరం ఏకతాటిపైకి వచ్చి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడుదామన్నారు. పార్టీకోసం కష్టపడుతున్న ఎంతో మంది సీనియర్లను ఆదర్శంగా తీసుకుని ప్రతీఒక్కరం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనంతగా పార్టీని బలోపేతం చేసేందకు తన శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్,డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్,పట్టణ అధ్యక్షులు గుడిపల్లి నగేష్,ఐఎన్టియూసి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రంగినేని శాంతన్ రావు,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సాయి చరణ్ గౌడ్, ఉప అధ్యక్షులు అర్బత్ ఖాన్,తాజా మాజీ మావల ఎంపీపీ దర్శనాల ఏవన్,కాంగ్రెస్ పార్టీ బేలా మండల అధ్యక్షులు ఫైజల్లా ఖాన్,బేలా మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజయ్ గుండావార్,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి,తాజా మాజీ కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్,షేక్ ఇమ్రాన్, జాఫర్ అహ్మద్,తాజా మాజీ కో ఆప్షన్ మెంబర్ ఇజ్జగిరి సంజయ్,నాయకులు కందుల సుకేందర్,రాజా లింగన్న, మహిళా నాయకురాలు శ్రీలేఖ ఆదివాసీ, లత, ఉయిక ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చిత్రపటాలకు నేతల పాలాభిషేకం



**ఆదిలాబాద్ మహా :** ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ సూచన మేరకు రాష్ట్రంలో కులగణన చేపట్టిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇతర రాష్ట్రాలతో పాటు దేశానికే ఆదర్శంగా నిలిచిందని టీపీసీసీ ఉపాధ్యక్షులు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్ , టీపీసీసీ కార్యదర్శి చిట్ల సత్యనారాయణ , ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని తరగింణి ఫంక్షన్ హాల్లో జరిగిన నియోజక వర్గ విస్తృతస్థాయి సమావేశం అనంతరం హాజరైన ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ చిత్ర పటానికి పాలాభిషేకం చేసారు. కేంద్రం జనగణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం వెనుక రాహుల్ గాంధీ ప్రయత్నం ఉందన్నారు. ఆయన ఒత్తిడి మేరకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జనగణన కు ముందుకు వచ్చిందన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయమన్నారు. అనంతరం రాష్ట్రంలో సీయం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కులగణన ,బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు, ఎస్సీ వర్గీకరణకు ఆమోదం , ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ చేపడుతున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసారు.ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి,డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్,డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్,పట్టణ అధ్యక్షులు గుడిపల్లి నగేష్,ఐఎన్టియూసి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రంగినేని శాంతన్ రావు,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సాయి చరణ్ గౌడ్, ఉప అధ్యక్షులు అర్బత్ ఖాన్,తాజా మాజీ మావల ఎంపీపీ దర్శనాల ఏవన్,కాంగ్రెస్ పార్టీ బేలా మండల అధ్యక్షులు ఫైజల్లా ఖాన్,బేలా మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజయ్ గుండావార్,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి,తాజా మాజీ కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్,షేక్ ఇమ్రాన్, జాఫర్ అహ్మద్,తాజా మాజీ కో ఆప్షన్ మెంబర్ ఇజ్జగిరి సంజయ్,నాయకులు కందుల సుకేందర్,రాజా లింగన్న, మహిళా నాయకురాలు శ్రీలేఖ ఆదివాసీ, లత, ఉయిక ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ పరిశీలకుల ఆధ్వర్యంలో

# రాజ్యంగ పరిరక్షణ ర్యాలీ



**ఆదిలాబాద్ మహా :** కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం అనంతరం హాజరైన అతిథులు నేతలంతా కలిసి పట్టణంలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. దేశంలోని మన రాజ్యాంగ సంస్థలను బలహీనపరచడానికి చేస్తున్న ప్రయత్నాన్ని తిప్పి కొట్టాలని నేతలు పిలుపునిచ్చారు.మతతత్వ విభజన ప్రతీకార రాజకీయాలను నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి మోదీ ప్రభుత్వం ఏమైనా చేస్తుందని దానిని కాంగ్రెస్ శ్రేణులు సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు.రాజ్యంగపరిరక్షణకై జై బాపు జై భీం జై సంవిధాన్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమం పట్ల నేతలు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్,డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్,పట్టణ అధ్యక్షులు గుడిపల్లి నగేష్,ఐఎన్టియూసి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రంగినేని శాంతన్ రావు,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సాయి చరణ్ గౌడ్, ఉప అధ్యక్షులు అర్బత్ ఖాన్,తాజా మాజీ మావల ఎంపీపీ దర్శనాల ఏవన్, కాంగ్రెస్ పార్టీ బేలా మండల అధ్యక్షులు ఫైజల్లా ఖాన్,బేలా మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజయ్ గుండావార్,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి,తాజా మాజీ కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్,షేక్ ఇమ్రాన్, జాఫర్ అహ్మద్,తాజా మాజీ కో ఆప్షన్ మెంబర్ ఇజ్జగిరి సంజయ్,నాయకులు కందుల సుకేందర్,రాజా లింగన్న, మహిళా నాయకురాలు శ్రీలేఖ ఆదివాసీ, లత, ఉయిక ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

**బీఆర్ఎస్ యువ నాయకుడు వై. మురళీకృష్ణ యాదవ్**

**గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కోఆర్డినేటర్ వినోద్ నాయక్ కు ఘన సన్మానం**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని బీఆర్ఎస్ యువ నాయకుడు వై.మురళీకృష్ణ యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హాఫీజ్ ఆధ్వర్యంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ జిల్లేడు చౌదరిగూడ మండల కోఆర్డినేటర్ గా చింతకుంట తండాకు చెందిన పాత్లవత్ వినోద్ నాయక్ నియమితులైన సందర్భంగా చౌదరిగూడ మండల కేంద్రంలో పాత్లవత్ వినోద్ నాయక్ ను పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ... మారుతున్న వాతావరణానికి అనుగుణంగా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం మానవాళిపై ఉందని, క్షేత్రస్థాయిలో పర్యావరణం పై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వాలపై, స్వచ్ఛంద సంస్థల పై, పర్యావరణ ప్రేమికుల పైన ఉందని అభిప్రాయపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ హరితహారం అనే కార్యక్రమాన్ని చేపట్టి అడవుల శాతాన్ని పెంచారని, ఆ ఘనత కేసీఆర్ కు దక్కిందని గుర్తు చేశారు. పార్టీలకతీతంగా అనువైన ప్రతి చోట మొక్కలను పెంచాలని, పర్యావరణ పరిరక్షణ కోసం గ్రీన్ చాలెంజ్ ఇండియా అనే పేరుతో మాజీ ఎంపీ సంతోష్ కుమార్ కృషి చేయడం అభినందనీయమని, ఆయనకు తోడుగా మనమందరం నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నటరాజ్, నర్సింగరావు, బాబు రావు, సత్య ప్రమోద్, జబ్బార్, అక్రమ్, రామచంద్రయ్య, గుండు అశోక్, ఇస్మాయిల్, మల్లేష్, నర్సింలు, పాండు, జహంగీర్, రాంచరణ్, ఆంజనేయులు, శివరాజ్, అసిఫ్, చందు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ నేతలతో మాజీ మంత్రి ఎర్రబెల్లి విస్తృత స్థాయి సమావేశం



**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లాలోని హసన్పర్తి మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు కలిపి బుధవారం హనుమకొండ (రాంనగర్) లోని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నివాసంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ క్యాడర్ సత్తా చాటాలని.. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం పై ముఖ్య నాయకులకు , కార్యకర్తలతో చర్చించారు. ముఖ్యంగా యువత వచ్చే స్థానిక ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా కష్టపడాలని దిశా నిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య సీనియర్ నాయకులు , కార్యకర్తలు, యూత్ సోషల్ మీడియా నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

# పహాల్గాం ప్రతిఘటన ఆపరేషన్ సింధూర్

**దశాబ్దాలుగా సహనం! వీడిన గ్రహణం**

**వీరత్వాన్ని చూపిన త్రివిధ దళాధిపతులు.. బీజేవైఎం అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఆమనగల్లు మున్సిపాలిటీ బీజేవైఎం యువమోర్చా, బిజెపి పార్టీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీని నిర్వహించి టపాసులు పేల్చి సంబరాలు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమనగల్లు మాజీ జెడ్పిటిసి కండే హరి ప్రసాద్ మాట్లాడుతూ.. మితిమీరిన సహనంతో చేతులు కట్టేసిన సమస్త భారతానికి "ఆపరేషన్ సింధూర్" తో తిరిగి భారత సమాజంలో వీరత్వాన్ని నింపిన త్రివిధ దళాధిపతులకు, వారికి వెన్నంటి నిలబడ్డ ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలుపుతూ... మీ వెన్నంటే మేము అని నినాదాలు చేశారు పాకిస్తాన్ తీవ్రవాదులు కాశ్మీర్ లో హిందువుల మీద చేసిన దాడి లో భర్తలను చంపి భార్యల సింధూరం తీసివేయడంతో కేంద్ర ప్రభుత్వం, భారత ఆర్మీ ఈ ఆపరేషన్ కు పెట్టిన పేరు "ఆపరేషన్ సింధూర్" అన్నారు. ఎల్ ఓ సి లో తొమ్మిది టెర్రరిస్ట్ క్యాంప్ ల పైన మన ఎయిర్ఫోర్స్ దాడి చేసి వారి దేశంలోకి వెళ్ళలేదు, వారి ఆర్మీని కవ్వించలేదు. లైన్ ఆఫ్ సెంట్రల్ (LOC)తో సంబంధం లేదు. ఆకస్మిక దాడి ఇది. ప్రధానమంత్రి నివాసం నుండి నరేంద్ర మోదీ రాత్రంతా పర్యవేక్షిస్తున్న భారత్ ఎయిర్ ఫోర్స్ చేసిన ఈ దాడిలో జైషే మహమ్మద్, లష్కరే తోయిబా, మరియు ఇతర తొమ్మిది టెర్రరిస్ట్ హెడ్ క్వార్టర్స్ పైన భారత ఆర్మీ దాడి చేశారు. చనిపోయిన వారి సంఖ్య, దాడి వివరాలు 10:0 గంటలకు CCS సమావేశంలో కేంద్ర ప్రభుత్వం 80 మంది మరణించినట్లుగా నిర్ధారించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమనగల్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి పటాకులు కాల్చి, బిజెపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు అమంగల్ మాజీ చైర్మన్ రాంపాల్ నాయక్, నాగర్ కర్నూల్ జిల్లా బిజెపి పార్టీ కౌన్సిల్ నెంబర్ చెక్కల లక్ష్మణ్, అమంగల్ మాజీ కౌన్సిలర్స్ చెన్నకేశవులు , శ్రీకాంత్ సింగ్,దుద్దు కృష్ణ యాదవ్,గోరటి నరసింహ, నాగర్ కర్నూల్ పార్లమెంట్ బీజేవైఎం కో కన్వీనర్ రవి రాథోడ్, కల్వకుర్తి అసెంబ్లీ బిజెపి పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ పద్మ ప్రశాంత్, ఆమనగల్ బిజెపి పార్టీ అధ్యక్షుడు ఎర్రవోలు శ్రీనివాస్, ఆమనగల్లు బీజేవైఎం పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, బీసి మోర్చా నాయకులు విష్ణు చారి,శ్రీనివాస్, బిజెపి పార్టీ సీనియర్ లీడర్ బుచ్చయ్య,సక్రు నాయక్, మక్తాల వెంకటయ్య, ఉప్పల నరసింహ, గాజుల మల్లయ్య, బిట్టు రాములు, ప్రవీణ్, సాయిబాబా, మహేష్, మల్లేష్, భరత్, శ్రీను, దేరంగుల పెద్దయ్య, బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ ఎత్తున పాల్గొనడం జరిగింది.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు

# ఇబ్బందులు కలిగించవద్దు

**రైతుల సమస్యల పై కలెక్టర్ కు వినతి పత్రం అందజేత**

**తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ**



**వరంగల్ మహా;** ఆరుగాలం కష్టపడి పండించిన పంట ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అమ్ముకుందామని కొనుగోలు సెంటర్లకు రైతులు ధాన్యాన్ని తీసుకువెళ్తే అనేక రకాలుగా ఇబ్బందులకు సెంటర్ వాళ్లు, కొంతమంది సెంటర్ అధికారులు రైతులకు ఇబ్బంది కలిగించడం జరుగుతుందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అన్నారు. బుధవారం తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ ను కలిసి మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వరంగల్ జిల్లా వరి ధాన్యం కొనుగోలు సెంటర్లను కొన్నింటిని పరిశీలించగా రైతులు పెద్ద ఎత్తున యాసింగి వరి పంట సాగు చేయడం జరిగిందని ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అమ్ముకోవడానికి సెంటర్ కు తీసుకొస్తే కొన్ని సెంటర్ లలో కొనుగోలుదారులు కొంతమంది అధికారులు రైతులను ఇబ్బందులకుగురి చేస్తున్నారని అలాగే కొనుగోలు కేంద్రాలలో సరైన సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల కురిసిన అకాల వర్షంతో రైతులు ఎంతో నష్టపోయారని ఈ సమస్యలను ఆయా కొనుగోలు కేంద్రాలలో తెలంగాణ రైతు సంఘం కమిటీ పర్యటించి పర్యవేక్షించడం జరిగింది. ఈ పర్యవేక్షణ క్రమంలో రైతులు మా ముందుకు తీసుకు వచ్చిన సమస్యలు 1) సెంటర్లో రైతుల పంటను కుప్ప పోసుకోవడానికి సరైన సౌకర్యాలు లేకపోవడం. 2) పంటను సెంటర్కు తీసుకొచ్చిన తర్వాత సుమారుగా 10 రోజుల పాటు కాంటాలు కాక ఉంటున్నారు. 3) అకాల వర్షం కురుస్తున్న క్రమంలో ఇట్టి పంట తడవకుండా తాడిపత్రిలు సెంటర్ వాళ్లు సమకూర్చడం లేదు. 4) బస్తాలు కాంటాలు వేసిన తర్వాత మిల్లుకు తరలించేదాకా రైతు బాధ్యతనని బస్తాలు మిల్లులో దిగుమతి అయ్యేంతవరకు తక్పట్టి ఇవ్వడం లేదు. పై తెలిపిన విషయాలను రైతులు మా దృష్టికి తీసుకు రావడం జరిగిందని దీనివలన రైతులు గ్రామాల్లోని ప్రైవేటు వ్యాపారస్తులకు తక్కువ ధరకు అమ్ముకునే పరిస్థితి నెలకొందని క్వింటాలుకు 1కంటికి 800వందల రూపాయలు రైతులు నష్టపోతున్నారు. రైతుల సమస్యలపై వెంటనే కలెక్టర్ స్పందించి కొనుగోలు కేంద్రాల అధికారులకు సిబ్బందికి ఈ సమస్యలపై దృష్టి సారించాలని రైతులను ఇబ్బంది పెట్టకుండా వెంటనే కాంటాలు వేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓదెల రాజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జెండా అంబయ్య, సిరుల రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు, తదితరులు, పాల్గొన్నారు.

# నగరంలో వైభవంగా సాగిన కన్యకాపరమేశ్వరి శోభాయాత్ర

**వరంగల్ మహా;** జగత్ జనని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని పురస్కరించుకొని బుధవారం వరంగల్ నగరంలో అమ్మవారి శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శోభాయాత్ర కన్వీనర్లు పొట్టి శ్రీనివాస్, దుబ్బ శ్రీనివాస్, దాచేపల్లి సీతారం ఆధ్వర్యంలో సాయంత్రం వరంగల్ స్టేషన్ రోడ్డులోని పోచమ్మ గుడి నుండి శోభాయాత్ర నగరంలోని పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారి శోభయాత్ర సందర్భంగా మహిళలు మంగళహారతులతో పాటు మేళతాళాలు, ఆడపడుచుల దాండియా ఆటలతో శోభాయమానంగా సాగింది. ఈ శోభాయాత్ర పోచమ్మ గుడి నుండి పోస్ట్ ఆఫీస్, వరంగల్ చౌరస్తా, జేపీఎన్ రోడ్, దుర్గేశ్వర స్వామి విధి, పిన్నవారి వీధి, ఇంతేజర్ గంజ్ పోలీస్ స్టేషన్, మీదుగా బట్టల బజార్ లోని రామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రక్కన గల వాసవి మాత దేవాలయం చేరుకున్న అనంతరం భక్తులందరికీ ప్రసాద వితరణ చేశారు. శోభాయాత్ర లో ఆర్యవైశ్య బంధుమిత్రులందరు పెద్ద ఎత్తున పాల్గొని దిగ్విజయం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్, సీనియర్ నాయకులు గందె నవీన్, ఆర్యవైశ్య కుల పెద్దలు, వ్యాపార సంఘాల ప్రతినిధులు, ముఖ్యులు, తదితరులు, పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

**తొర్రూర్, మహా:** తొర్రూరు మండలం మరియు మున్సిపాలిటీ పరిధిలోని ముఖ్య సీనియర్ నాయకుల వివిధ గ్రామాల మాజీ సర్పంచ్ లు మాజీ ఎంపీటీసీలు పట్టణ వార్డు మున్సిపల్ కౌన్సిలర్లు వివిధ హోదాల్లో ఉన్నటువంటి బీఆర్ఎస్ పార్టీ నాయకులతో ఏర్పాటు చేసినటువంటి బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గోన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని స్థానిక సంస్థల్లో బిఆర్ఎస్ పార్టీ నుండి ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులను అధిక మెజార్టీతో సర్పంచ్ లను ఎంపీటీసీలను గెలిపించుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ప్రతి ఒక్క ముఖ్య నాయకులకు కార్యకర్తలకు యూత్ విభాగానికి వచ్చే స్థానిక ఎన్నికల్లో గెలిపే దిశగా కష్టపడాలని ప్రతి ఒక్కరికి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కటుకం అశోక్



**కాటారం, మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ కు నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. భూపాలపల్లి జిల్లా శాఖ అధ్యక్షులుగా మహాదేవపూర్ కు చెందిన కటుకం అశోక్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. భూపాలపల్లి నూతన జిల్లాగా ఏర్పడిన తర్వాత మొదటిసారిగా కాటారం సబ్ డివిజన్ లోని ఐదు మండలాలకు చెందిన ఫర్టిలైజర్స్ అండ్ వ్యాపారస్తులకు మొదటిసారిగా జిల్లా శాఖ అధ్యక్ష పదవి లభించడం పట్ల ఈ ప్రాంత వ్యాపారస్తులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహాదేవపూర్ కు చెందిన కటుకం అశోక్ కాంగ్రెస్ పార్టీలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కటకం మహేష్ ఏకగ్రీవంగా జిల్లా అధ్యక్ష పదవికి ఎన్నికవడం పట్ల కాటారం సబ్ డివిజన్లోని ఎరువుల వ్యాపారస్తులందరూ హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన



**వెంకటాపురం మహా:** ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మ ఇండ్లు పేదవాళ్ళకి ఇవ్వాలని పూరి గుడిసెలో ఉన్న వాళ్లకు ప్రతి ఒక్కరికి ఇల్లు వస్తాయని మొదటి విడతగా 3500 ఇండ్లు నిర్మాణం కార్యక్రమంలో పేదవాళ్లలో బహు పేదవాళ్లు కు ప్రతి ఇంటికి ఐదు లక్షల చొప్పున నాలుగు విడతలగా బేస్మెట్ కట్టడంతో లక్ష రూపాయలు ఇస్తారన్నారు. కిటికీ లెవెల్ కట్టడంతో ఒక లక్ష ఇరవై ఐదు వేలు, స్లాబ్ వెయ్యడంతో లక్ష డెబ్బై ఐదువేల చొప్పున పూర్తిగా కట్టిన తర్వాత లక్ష రూపాయలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్ల వెంకట్రావు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ,బాలసాని లక్ష్మీ నారాయణ, చిడెం మోహన్ రావు, మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ పలు నాయకులు పాల్గొన్నారు.

# మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ఆర్థిక ఉత్పత్తులు



టైర్ 2, ఇతర పట్టణాల్లో చిన్నతరహా వ్యాపారాలు నిర్వహించే మహిళలు తమ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకమైన ఆర్థిక ఉత్పత్తులను కోరుకుంటున్నట్టు 'భారత్ ఉమెన్ యాస్పిరేషన్ ఇండెక్స్ (బీడబ్ల్యూఏఐ) 2025' నివేదిక వెల్లడించింది. బిజినెస్ మేనేజ్మెంట్ ప్లాట్‌ఫామ్ 'ట్రైడ్' దీన్ని విడుదల చేసింది. అంతేకాదు ఆయా పట్టణాల్లో చిన్నతరహా మహిళా పారిశ్రామికవేత్తల్లో మూడింట ఒక వంతు మంది రుణం పొందే విషయంలో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. తనఖా నిబంధనలు కఠినంగా ఉండడం, ఆర్థిక అక్షరాస్యత తగినంత లేకపోవడం వీరిని రుణ సదుపాయానికి దూరం చేస్తోందని, వీరికి తనఖా రహిత సూక్ష్మ రుణాలు సహా తదితర ప్రత్యామ్నాయ రుణ సదుపాయాలు అందించేందుకు సత్వర విధానపరమైన చర్యలు అవసరమని ఈ నివేదిక సూచించింది. ''టైర్ 2, 3, అంతకంటే చిన్న పట్టణాల్లో మహిళా పారిశ్రామికవేత్తలు డిజిటల్ అవగాహనతో వృద్ధి చెందాలన్న ఆకాంక్షలతో ఉన్నారు. కానీ, రుణ సదుపాయం, నెట్‌వర్క్‌లు, తదితర సంస్థాగత అంతరాలు వారిని వెనకడుగు వేసేలా చేస్తున్నాయి''అని తెలిపింది.

**మహిళల అభిప్రాయాలు..**

- 1,300 మంది మహిళా వ్యాపారవేత్తల అభిప్రాయాలను బీడబ్ల్యూఏఐ సర్వే చేసింది. ఆర్థిక, వ్యాపార నిర్వహణ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాల్సి ఉందని 58% మంది చెప్పడం గమనార్హం.
- డిజిటల్ నైపుణ్యాలను పెంచుకోవాలన్న బలమైన ఆకాంక్ష 12 శాతం మందిలో కనిపించింది.
- 28 శాతం మంది నిధుల విషయంలో తమ కుటుంబం నుంచి పురుష సభ్యుడి సహకారం అవసరమని చెప్పారు. వ్యవస్థాపకులుగా వారి ప్రయాణంలో ఇదొక పెద్ద అడ్డంకిగా నివేదిక పేర్కొంది.
- డిజిటల్ నైపుణ్యాల పెంపు, వారికి లభిస్తున్న వివిధ పథకాల సమాచారం అందించడం, నెట్‌వర్కింగ్ పెంపు ద్వారా మహిళా పారిశ్రామికవేత్తల లక్ష్యాలను సులభతరం చేయొచ్చని ఈ నివేదిక సూచించింది.

# ఎగిసిన స్టాక్ ఎక్స్ఛేంజీల లాభాలు





స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ గతేడాది (2024-25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 7 శాతం పుంజుకుని రూ. 2,650 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 2,488 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 13 శాతం క్షీణించి రూ. 4,397 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం క్యూ4లో రూ. 5,080 కోట్ల టర్నోవర్ అందుకుంది. వాటాదారులకు షేరుకి రూ. 35 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. దీనిలో రూ. 11.46 ప్రత్యేక డివిడెండ్ కలసి ఉంది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఎన్ఎస్ఈ నికర లాభం 47 శాతం జంప్‌చేసి రూ. 12,188 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం సైతం 17 శాతం ఎగసి రూ. 19,177 కోట్లకు బలపడింది. ఈ కాలంలో మొత్తం రూ. 59,798 కోట్లమేర సెక్యూరిటీ లావాదేవీల పన్ను(ఎస్‌టీటీ) చెల్లించింది.

**బీఎస్ఈ లాభం హైజంప్**

మరో స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం బీఎస్ఈ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి (క్యూ4)లో నికర లాభం హైజంప్ చేసి రూ. 494 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 107 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 543 కోట్ల నుంచి రూ. 926 కోట్లకు ఎగసింది. వాటాదారులకు షేరుకి రూ. 23 డివిడెండ్ ప్రకటించింది. దీనిలో రూ. 5 ప్రత్యేక డివిడెండ్ కలసి ఉంది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి బీఎస్ఈ నికర లాభం 3 రెట్లు దూసుకెళ్లి రూ. 1,322 కోట్లను తాకింది. 2023-24లో కేవలం రూ. 404 కోట్ల లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,596 కోట్ల నుంచి రూ. 3,236 కోట్లకు బలపడింది. ఈ కాలంలో ఈక్విటీ డెరివేటివ్స్‌లో 30.5 బిలియన్ కాంట్రాక్టులు ట్రేడ్‌కాగా.. రూ. 1,415 కోట్ల ఆదాయం నమోదైనట్లు బీఎస్ఈ వెల్లడించింది.

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఈఎంఐలు తగ్గుతాయ్...




దేశంలో అతిపెద్ద ప్రైవేటు రంగ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో లోన్ కస్టమర్లు చెల్లించే నెలవారీ వాయిదాలు (ఈఎంఐలు) తగ్గనున్నాయి. ఈ మేరకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను (ఎంసీఎల్ఆర్) తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఎంపిక చేసిన రుణ కాలపరిమితిపై ఎంసీఎల్ఆర్‌ను 15 బేసిస్ పాయింట్లు (బీపీఎస్) అంటే 0.15% తగ్గించింది. ఈ సవరణ తరువాత, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎంసీఎల్ఆర్ ఇప్పుడు రుణ కాల పరిమితిని బట్టి 9 శాతం నుంచి 9.20 శాతం వరకు ఉంటుంది. ఇది ఇంతకు ముందు 9.10 శాతం నుంచి 9.35 శాతం ఉండేది. సవరించిన రేట్లు మే 7 నుంచి అమల్లోకి వచ్చాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) ఏప్రిల్లో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన నేపథ్యంలో తరువాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కూడా ఎంసీఎల్ఆర్‌లో మార్పులు చేసింది. 2025 ఫిబ్రవరి నుండి రెపోరేటు మొత్తం తగ్గింపు 50 బేసిస్ పాయింట్లకు చేరుకుంది. రెపో రేటు అనేది వాణిజ్య బ్యాంకులకు ఆర్బీఐ ఇచ్చే రుణంపై వసూలు చేసే వడ్డీ రేటు. ఇది తగ్గితే సాధారణంగా బ్యాంకింగ్ రంగంలో రుణ వ్యయాలు తగ్గుతాయి. ఫలితంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి బ్యాంకులు తక్కువ రుణ రేట్ల ద్వారా తక్కువ ఫండింగ్ ఖర్చుల ప్రయోజనాలను కస్టమర్లకు బదిలీ చేస్తున్నాయి.

**రుణగ్రహీతలకు ఏంటి ప్రయోజనం?**

ఎంసీఎల్ఆర్ అనేది ఒక నిర్దిష్ట రుణం కోసం ఒక ఆర్థిక సంస్థ వసూలు చేయాల్సిన కనీస వడ్డీ రేటు. ఇది రుణానికి వడ్డీ రేటు తక్కువ పరిమితిని నిర్ణయిస్తుంది. ప్రత్యేకంగా ఆర్బీఐ సవరిస్తే తప్ప ఇదే రేటును బ్యాంకులు అమలు చేస్తాయి. 2016లో ఆర్బీఐ ప్రవేశపెట్టిన ఎంసీఎల్ఆర్‌ను గృహ, వ్యక్తిగత, వాహన రుణాలతో సహా వివిధ ఫ్లోటింగ్ రేట్ రుణాలకు ఉపయోగిస్తారు. ఎంసీఎల్ఆర్ తగ్గడం వల్ల రుణం ఫిక్స్డ్ లేదా ఫ్లోటింగ్ వడ్డీ రేటుపై ఆధారపడిన రుణ ఈఎంఐలు తగ్గుతాయి లేదా రుణ కాలపరిమితి తగ్గుతుంది.

# ఐటీ ఉద్యోగం ఒక్కసారి పోతే.. ఇక అంతే..!




ప్రస్తుత పరిస్థితిలో ఐటీ ఉద్యోగం తెచ్చుకోవడం ఎంత కష్టమో.. దాన్ని నిలబెట్టుకోవడమూ అంతే కష్టం. ఎప్పటికప్పుడు నైపుణ్యాలను పెంపొందించుకుంటూ మంచి పనితీరు కనబర్చాలి. వెనకబడిన ఉద్యోగులను కంపెనీలు ఉపేక్షించడం లేదు. వెంటనే ఉద్వాసన పలుకుతున్నాయి. దీనికి సంబంధించే ప్రపంచ టెక్ దిగ్గజం కీలక నిర్ణయం తీసుకుంది. పనితీరు సమస్యలతో ఉద్యోగం కోల్పోయి కంపెనీని వీడిన ఉద్యోగులపై మైక్రోసాఫ్ట్ రెండేళ్ల నిషేధం విధానాన్ని ప్రవేశపెట్టింది. అంటే ఇలా జాబ్ పోగుట్టుకుంటే మళ్లీ రెండేళ్ల వరకూ ఆ ఛాయలకూ కూడా వెళ్లే అవకాశం ఉండదన్న మాట. అంతేకాదు.. ఈ ఉద్యోగాల కోతలను 'గుడ్ అట్రిషన్'గా పిలుస్తారు. అంటే కంపెనీని విడిచిపెట్టాలనుకునే ఉద్యోగులను సంతోషం..దయచేయండి.. అని భావిస్తుందని బిజినెస్ ఇన్‌సైడర్ నివేదిక తెలిపింది. గత రెండు నెలలుగా మైక్రోసాఫ్ట్ తన సిబ్బంది పనితీరు నిర్వహణ ప్రక్రియను పునర్‌వ్యవస్థీకరిస్తోంది. పనితీరు తక్కువగా ఉన్న ఉద్యోగులపై కంపెనీ కఠినంగా వ్యవహరించింది. పనితీరు కనబరచని ఉద్యోగులను తొలగించే సంస్థ వ్యూహంలో భాగంగా ఈ రెండు కొత్త టూల్స్ ఉన్నాయి. ఈ ఏడాది పనితీరు తక్కువగా ఉన్న 2000 మంది ఉద్యోగులను మైక్రోసాఫ్ట్ తొలగించింది. పనితీరు సరిగా లేని ఉద్యోగులకు కంపెనీ సెవెరెన్స్ ప్యాకేజీ కూడా ఇవ్వలేదు. బిజినెస్ ఇన్‌సైడర్ ప్రకారం కంపెనీ 'గుడ్ అట్రిషన్' ప్రణాళిక ప్రతి సంవత్సరం నిర్ణీత శాతం ఉద్యోగులను తొలగించాలన్న కంపెనీ లక్ష్యానికి అనుగుణంగా ఉంటుంది.


**బడా టెక్ కంపెనీల పనితీరు విధానాల్లో మార్పు**

బడా టెక్ కంపెనీల్లో ఉద్యోగుల నిలుపుదల, పనితీరు విధానాల్లో విస్తృత మార్పు వచ్చింది. మెటా, అమెజాన్ వంటి కంపెనీలు కూడా తమ ప్రస్తుత, ఔట్ గోయింగ్ ఉద్యోగుల పనితీరుపై కఠిన విధానాలను ప్రవేశపెట్టాయి. గతంలో అమెజాన్ 'అన్ గ్రేటెడ్ అట్రిషన్'ను ప్రవేశపెట్టింది.దీని ప్రకారం మేనేజర్లు ప్రతి సంవత్సరం తమ బృందంలో కొంత మందిని తొలగించాల్సి ఉంటుంది. పనితీరు తక్కువగా ఉన్న తమ ఉద్యోగులపై కూడా మెటా వేటు వేస్తోంది. బిజినెస్ ఇన్‌సైడర్ ప్రకారం ఇక తిరిగి నియమించుకోకూడదనంటూ కొంతమంది మాజీ ఉద్యోగులను ఈ కంపెనీ జాబితా చేసిపెట్టుకుంది.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL





# రంగంలోకి దోవల్ ది జేమ్స్ బాండ్!

### ఆపరేషన్ సింధూర్ వెనుక మాస్టర్ మైండ్

**అమెరికా, వివిధ దేశాల ప్రతినిధులతో ఎన్ఎస్ఏ చర్చలు**

**వివిధ దేశాల మద్దతు కూడగడుతున్న నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్**


**ఆపరేషన్ సిందూర్‌కు గల కారణాలు పలు దేశాల ఎన్ఎస్ఏలకు వెల్లడి**

**ఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ప్రదేశాలలో ఉగ్రవాదులు, వారి మౌలిక సదుపాయాలపై కేంద్రీకృత దాడులు జరిగిన తర్వాత మన నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ అజిత్ దోవల్ పలు దేశాల ఎన్ఎస్ఏలతో మాట్లాడారు. అమెరికా, బ్రిటన్, సౌదీ అరేబియా, జపాన్, రష్యా, ఫ్రాన్స్ దేశాల భద్రతా సలహాదారులు, కార్యదర్శులకూ దోవల్ వివరించారు. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో,యూకే విదేశాంగ కార్యదర్శి జోనాథన్ పావెల్, సౌదీ విదేశాంగ కార్యదర్శి ముసైద్ అల్ ఐబాన్, యూఏఈ విదేశాంగ కార్యదర్శి షేక్ తహ్నూన్, జపాన్ విదేశాంగ కార్యదర్శి మసటకా ఒకానోతో సహా అనేక దేశాల విదేశాంగ కార్యదర్శిలతో అజిత్ దోవల్ ఫోన్‌లో సంభాషించారు. వీరితో పాటు, సీపీసీ సెంట్రల్ కమిటీ పొలిటికల్ బ్యూరో సభ్యుడు, పీఆర్సీ విదేశాంగ మంత్రి వాంగ్ యి, ఇంకా ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ బోన్‌కు దౌత్య సలహాదారు అయిన రష్యన్ విదేశాంగ కార్యదర్శి సెర్గీ షోయిగుతో కూడా అజిత్ సంప్రదింపులు జరిపారు. ఈ టెలిఫోన్ సంభాషణలో విదేశాంగ కార్యదర్శి తన సహచరులకు.. యుద్ధానికి సంబంధించి తీసుకున్న చర్యలు, అమలు విధానం గురించి వివరించారు. అయితే, ఈ యుద్ధం తీవ్రతరం కానిది, సంయమనంతో కూడినది అని ఆయన సహచరులకు తెలిపారు.

**దోవల్ ది జేమ్స్ బాండ్**

ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన సమయంలోనే మరో కీలక నియామకం జరిగింది. ప్రధాని మోదీ ఏరి కోరి జాతీయ భద్రతా సలహాదారుగా అజిత్ దోవల్ ను ఎంపిక చేశారు. ఈ నిర్ణయం వెనుక పెద్ద చరిత్రే ఉంది. అజిత్ దోవల్ 1968 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. అసాధారణ మేధస్సు ఆయన సొంత. ఆయనను తరచుగా జేమ్స్ బాండ్ ఆఫ్ ఇండియా అని పిలుస్తారు. మిలటరీ ఆపరేషన్స్.. శత్రు దేశాల గుట్టు దోవల్ కు తెలిసినట్లుగా మరెవరికీ తెలియదు. ఇప్పుడు జాతీయ భద్రతా సలహాదారుగా ఉన్న దోవల్ సర్వీసులో ఉన్న సమయంలో పాకిస్తాన్‌లో 7 సంవత్సరాలు రహస్యంగా గడిపారు. అక్కడి రహస్యాలను భారత్ కు అందించటంలో కీలక పాత్ర పోషించారు. ఖలిస్తాన్ ఉగ్రవాదం సమయంలోనూ అజిత్ దోవల్ ఉగ్రవాద గ్రూపులను చొరబాటు చేయడానికి పనిచేసే చురుకైన ఫీల్డ్ ఏజెంట్‌గా వ్యవహరించారు.

# ప్రసాదంలో పాము పిల్ల



హోసూరు: ఆలయ సిబ్బంది, ప్రసాదం నిర్వాహకుల నిర్లక్ష్యం భక్తులను కలవరపరచింది. హోసూరు కార్పొరేషన్ పరిధిలో వెలసిన ప్రసిద్ధ మరగతాంబ సమేత శ్రీ చంద్రచూడేశ్వర స్వామి ఆలయంలో ప్రసాదంలో పాము పిల్ల వచ్చింది. వివరాలు.. కొండమీద ఉన్న ఆలయానికి నిత్యం వందలాది భక్తులు వచ్చి దర్శనాలు చేసుకుని ప్రసాదాలు కొంటారు. ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ ప్రసాదాల దుకాణం ఉంది. మంగళవారం ఓ భక్తుడు పులిహోర ప్రసాదం డబ్బా కొనుగోలు చేశాడు. తెరవగానే అందులో చచ్చిన పాము పిల్ల కనిపించగానే దిగ్భ్రాంతి చెందాడు. భక్తులు కలిసి దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వంట సిబ్బంది వండేటప్పుడు పాము పిల్ల పడి ఉంటుందని అనుమానిస్తున్నారు.

# ఆపరేషన్ సిందూర్.. మసూద్ అజర్ ఫ్యామిలీ ఖతం



ఢిల్లీ: ఉగ్రవాదుల స్థావరాలే లక్ష్యంగా ఇండియన్ ఆర్మీ బుధవారం అర్ధరాత్రి చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' దాయాది పాకిస్థాన్‌కు భయం పుట్టిస్తోంది. ప్రధానంగా జైషే మహ్మద్, లష్కరే తోయిబా ప్రధాన స్థావరాలను లక్ష్యంగా చేసుకొని వాటిని కూల్చివేసింది. విజయవంతంగా జరిపిన ఈ 'ఆపరేషన్ సిందూర్'లో జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు చావు దెబ్బ తగిలినట్లు సమాచారం. జైషే ముఠాకు చెందిన ఓ స్థావరంపై జరిగిన దాడిలో 14 మంది మృతిచెందినట్లు తెలుస్తోంది. ఇందులో 10 మంది మసూద్ కుటుంబసభ్యులేనని జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. బవహల్పూర్ లోని జైష్‌ఎమహమ్మద్, మురిద్కే కేంద్రంగా ఉన్న లష్కర్‌ఎతొయిబా క్యాంపులపై ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ జరిపిన దాడుల్లో దాదాపు 90 మంది ఉగ్రవాదులు హతమైనట్లుగా సమాచారం. ముఖ్యంగా బవహల్పూర్‌లోని జైష్ ఎమహమ్మద్ శిబిరాలు, సుభాన్ అల్లా కాంప్లెక్స్‌పై జరిపిన ఎయిర్ స్ట్రైక్‌లో ఆ సంస్థ చీఫ్ మసూద్ అజార్ కుటుంబ సభ్యులు 10 మందితో పాటు అనుచరులు మరణించినట్లు తెలుస్తోంది. మసూద్ అజార్ అక్క, బావ, మేనల్లుడు, అతడి భార్య కూడా ఉన్నట్లు సమాచారం.



# సైనికులకు పూర్తి మద్దతు

### ఆపరేషన్ సిందూర్ సాహసోపేత నిర్ణయం

- **దేశ రక్షణ, ఐక్యత కాపాడటానికి అండగా ఉంటాం**
- **కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ**
- **ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఏఐసీసీ అత్యవసర సమావేశం**

**ఢిల్లీ:** భారత్ చేపట్టిన దాడుల నేపథ్యంలో బుధవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ బుధవారం అత్యవసరంగా సమావేశం అయ్యింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్, సచిన్ పైలట్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పహల్గాం దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర శిబిరాలపై భారత్ సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను కాంగ్రెస్ స్వాగతించింది. ఈ విషయంలో తమ పార్టీ తరఫున సైనికులకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ ప్రకటించింది. అనంతరం పార్టీ నేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ విలేకరులతో మాట్లాడారు. ఉగ్రవాద స్థావరాలపై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో సాహసోపేత నిర్ణయం తీసుకున్న భారత సాయుధ దళాలను చూసి తాము గర్విస్తున్నామని మల్లికార్జున ఖర్గే అన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడడానికి అన్ని స్థాయిల్లో ఐక్యంగా ఉండాలన్నారు. దేశ రక్షణ, ఐక్యత, స్వేచ్ఛను కాపాడడానికి తమ పార్టీ తరఫున సైనికులకు పూర్తి మద్దతు ఇస్తున్నామని వెల్లడించారు. సాయుధ దళాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని రాహుల్ గాంధీ కూడా ప్రకటించారు. అంతకు ముందు జై హింద్.. మన సాయుధ దళాలను చూసి గర్విస్తున్నానని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. 'మన సాయుధ దళాలను చూసి గర్వపడుతున్నాను. జై హింద్' అని రాహుల్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

# పాక్‌కు యూకే షాక్.. వీసాలపై పరిమితులు!



**లండన్:** చదువు, ఉద్యోగం కోసం వెళ్లి శరణార్థి పేరిట అక్కడే శాశ్వతంగా తిష్ట వేస్తున్న పాకిస్తాన్ పౌరులకు యూకే షాకిచ్చింది. ఆసైలం (శాశ్వత నివాసం) దరఖాస్తుల సంఖ్య పెరుగుదల నేపథ్యంలో పాకిస్తానీ పౌరులకు యూకే వీసా నిబంధనలను కఠినం చేయనుంది. వీసా ఓవర్‌స్టేలు, ఆసైలం దరఖాస్తులపై కఠిన చర్యల్లో భాగంగా, యూకే ప్రభుత్వం పాకిస్తానీ పౌరులతో పాటు నైజీరియా, శ్రీలంక నుండి వచ్చే వారికి స్టడీ, వర్క్ వీసాలపై కఠినమైన పరిమితులను విధించనుందని టైమ్స్ వార్తా సంస్థ కథనం పేర్కొంది. యూకే శాశ్వత నివాసం కోసం వీసా హోల్డర్ల నుండి దరఖాస్తులు ఇటీవల అసాధారణ స్థాయిలో పెరుగుతున్నాయి. ఇందులో పాకిస్తానీ పౌరులు అగ్రస్థానంలో ఉన్నారు. హోమ్ ఆఫీస్ డేటా ప్రకారం.. 2024లో మొత్తం 108,000 మంది ఆసైలం కోసం దరఖాస్తు చేసుకోగా వీరిలో అత్యధికంగా 10,542 మంది పాకిస్తానీ పౌరులే ఉన్నారు.వీరిలో 16,000 మంది స్టూడెంట్ వీసాలపై యూకేకి వచ్చారు. పాకిస్తానీ, నైజీరియన్, శ్రీలంక దేశీయులు వర్క్, స్టూడెంట్ లేదా విజిటర్ వీసాలపై వచ్చి ఆ తర్వాత ఆసైలం కోసం దరఖాస్తు చేసే అవకాశం ఎక్కువగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దీనిని అధికారులు "సిస్టమ్ దుర్వినియోగం"గా వర్ణించారు. ఈ నేపథ్యంలో వీసాలిచ్చే సమయంలోనే కఠినంగా వ్యవహరించాలని యూకే ప్రభుత్వం భావిస్తోంది. కొత్త నిబంధనల్లో భాగంగా వీసా దరఖాస్తుదారులను వారి ఆసైలం దరఖాస్తు రిస్క్‌ను అంచనా వేయడానికి ప్రొఫైలింగ్ చేస్తారు. అధిక రిస్క్‌గా భావించిన వారి వీసా దరఖాస్తులను తిరస్కరిస్తారు. అంతేకాదు..వీసా హోల్డర్లు ఆర్థికంగా స్వతంత్రంగా ఉన్నట్లు నిరూపించుకోకపోతే, వారికి పన్ను చెల్లింపుదారుల నిధులతో నడిచే వసతి సౌకర్యాలను నిషేధించాలని ప్రభుత్వం యోచిస్తోంది. యూకే ప్రభుత్వం 2024లోనూ కేర్ వర్కర్లు, స్టూడెంట్లకు డిపెండెంట్లను తీసుకురాకుండా కఠిన నిబంధనల విధించింది.

# ఆ మార్పుకి నేను సిద్ధంగా ఉన్నాను: హీరో శ్రీవిష్ణు



'నేను ఇండస్ట్రీకి వచ్చి పదహారేళ్ల అవుతుంది. ఈ పదహారేళ్లలో ఎక్కడ కూడా బోర్ కొట్టించని సినిమాలే చేశానని భావిస్తున్నాను. రానున్న రొజులలో చాలా మార్పులు రాబోతున్నాయి. పెద్ద రెవల్యూషన్ రాబోతుంది. నెక్స్ట జనరేషన్ కిడ్స్ రాబోతున్నారు. ఆ మార్పు కి నేను సిద్ధంగా ఉన్నాను. ప్రతి క్యారెక్టర్ లో ది బెస్ట్ ఇచ్చుకుంటూ వెళ్తున్నాను' అన్నారు హీరో శ్రీవిష్ణు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం #సింగిల్(#single movie). కేతిక శర్మ, ఇవానా హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి కార్తిక్ రాజు దర్శకత్వం వహించారు. మే9న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా హీరో శ్రీవిష్ణు మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు..

- డైరెక్టర్ కార్తీక్ రాజు ఈ సినిమా కథ చెప్పినప్పుడు చాలా మంచి ఎంటర్టైనర్ అవుతుందని నమ్మకం కలిగింది. ఫైనల్ గా సినిమా చూసుకున్న తర్వాత చాలా పెద్ద ఎంటర్టైనర్ అవుతుందని అనిపించింది.ఇప్పటివరకు విడుదలైన టీజర్ ట్రైలర్ పాటలకి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రమోషన్స్ కూడా చాలా పాజిటివ్ గా ఉన్నాయి. ఇదంతా టీమ్ ఎఫర్ట్ అని భావిస్తున్నాను.
- ఈ సినిమా క్లైమాక్స్ కొత్తగా ఉంటుంది. నా క్యారెక్టర్, వెన్నెల కిషోర్ గారి క్యారెక్టర్. ఇద్దరు హీరోయిన్స్ క్యారెక్టర్స్ ని ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తారు. ఈ నాలుగు క్యారెక్టర్లు కూడా ఆడియన్స్ కి చాలా నచ్చుతాయి. క్లైమాక్స్ చాలా యూనిక్ గా ఉంటుంది. అందరిని ఎంటర్టైన్ చేస్తుంది.
- సినిమాని కంప్లీట్ గా హైదరాబాద్ లో తీసాం. హైదరాబాద్‌ని చాలా కొత్తగా చూపించాం. ఈ మధ్యకాలంలో హైదరాబాద్ ని ఇంత కొత్తగా ఎవరు చూపించలేదు. చాలా బెస్ట్ మూమెంట్స్ ని క్యాప్చర్ చేశాం.
- నేను ప్రతి క్యారెక్టర్ నీ ఎంజాయ్ చేస్తాను. డైరెక్టర్ తోనే ఎక్కువ ట్రావెల్ చేస్తాను. ఆ ట్రావెల్ లోనే 50% వచ్చేస్తుంది. తర్వాత లొకేషన్ లో ఇంకొంత క్యారెక్టర్ మీద కమాండ్ పెరుగుతుంది.
- ఈ సినిమాలో నా బాడీ లాంగ్వేజ్ కొత్తగా ఉంటుంది. ఇందులో లవ్‌స్టోరీ ఉంటుంది. దానికి తగ్గట్లుగానే నా బాడీ లాంగ్వేజ్ ఉంటుంది. గత చిత్రాలతో పోల్చుకుంటే ఈ సినిమాలో ఒక డిఫరెంట్ బాడీ లాంగ్వేజ్ ఆడియన్స్ చూస్తారు.
- సినిమా ఒక హైపర్ ఎనర్జీతో వచ్చింది. దానికి తగ్గట్టు విశాల్ చంద్రశేఖర్ ఎనర్జిటిక్ సాంగ్స్ ఇచ్చారు. ఆర్ఆర్ చాలా బాగా చేశారు. చాలా కొత్తగా ఉంటుంది. చాలా ఇన్నోవేటివ్ సౌండ్ ఉంటుంది
- సామజవరగమన, ఓం భీమ్ బుష్ సినిమాల తర్వాత వచ్చిన సినిమా కావడంతో స్వాగ్ ఒక ఫుల్ కామెడీ సినిమా అనుకున్నారు. మేము కూడా ప్రాపర్ కంటెంట్ ఇలా ఉంటుందని ప్రిపేర్ చేయలేకపోయాం. అందుకే చిన్న కన్ఫ్యూజన్ ఏర్పడిందని అనుకుంటున్నాను. ఫుల్ ఫన్ అని వచ్చిన వాళ్ళు కొంత డిసప్పాయింట్మెంట్ అయిన మాట నిజమే. ఒక డిఫరెంట్ కంటెంట్ సినిమా చూడాలనే ఆడియన్స్ కి సినిమా చాలా నచ్చింది. టెలివిజన్ లో వచ్చిన తర్వాత కూడా చాలా మంచి అప్లోజ్ వచ్చింది. ప్రయోగం చేసినప్పుడు వర్క్ కాకపోతే దానిని ఎక్స్పీరియన్స్ కింద చూడాలి. వర్క్ అయినా వర్క్ కాకపోయినా కొత్త ప్రయత్నం మానకూడదని నా అభిప్రాయం.
- గీతా ఆర్ట్స్ లో వర్క్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. నేను ఎప్పటినుంచో గీతా ఆర్ట్స్ లో చేయాలి. లక్కీగా ఈ సినిమా కుదిరింది 100% కాన్ఫిడెన్స్ ఉన్న జోనర్ ఇది. ఈ జోనర్ లో గీత ఆర్ట్స్ తో చేయడం వెరీ వెరీ హ్యాపీ.
- ప్రస్తుతం మృత్యుంజయ అనే ఒక థ్రిల్లర్ చేస్తున్నాను. అలాగే ఒక ఫ్యామిలీ ఎంటర్టైనర్ చేస్తున్నాను.అలాగే ఒక ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో ఒక సినిమా చేస్తున్నాను.






# న్యూ బిగినింగ్స్.. మళ్లీ జంటగా కనిపించిన సమంత

గతంలో హీరో నాగచైతన్యని ప్రేమించి పెళ్లి చేసుకున్న సమంత.. తర్వాత విడాకులు తీసుకుంది. ఇది జరిగి దాదాపు నాలుగేళ్లు గడిచిపోయాయి. అప్పటినుంచి ఒంటరిగానే ఉంటోంది. కానీ గత కొన్నిరోజుల క్రితం సమంత పెళ్లి గురించి రూమర్స్ వినిపించాయి. ఇప్పుడదే దర్శకుడితో మళ్లీ కనిపించడం, ఆ ఫొటోలని పోస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. విడాకుల తర్వాత సమంత.. తాను మయోసైటిస్ అనే అరుదైన వ్యాధి బారిన పడ్డాననే విషయాన్ని బయటపెట్టింది. మధ్యలో విజయ్ దేవరకొండతో కలిసి ఖుషి సినిమా చేసింది. ఇది తప్పితే మరో మూవీ చేయలేదు. మధ్యలో ఓ వెబ్ సిరీసులో నటించిందంతే. సరే అసలు విషయానికొస్తే.. ఫ్యామిలీ మ్యాన్ వెబ్ సిరీస్ లో రెండో సీజన్ లో సమంత నటించింది. ఈ సిరీస్ చేసిన దర్శకుల్లో ఒకరైన రాజ్ తో రీసెంట్ టైంలో సమంత ఎప్పటికప్పుడు కలిసి కనిపిస్తూనే ఉంది. కొన్నిరోజుల క్రితం ఇద్దరూ కలిసి తిరుపతి కూడా వెళ్లొచ్చారు. దీంతో ఇద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారనే పుకార్లు వినిపించాయి. సామ్ నుంచి రెస్పాన్స్ లేదు కాబట్టి ఇది రూమర్ గానే మిగిలిపోయింది. తాజాగా న్యూ బిగినింగ్స్ అని ఓ పోస్ పెట్టింది. ఇందులో తన త్రలాలా నిర్మాణ సంస్థ గురించి, తాను నిర్మించిన శుభం మూవీ గురించి కొన్ని ఫొటోలు షేర్ చేసింది. ఇందులోనూ రాజ్ తో సమంత దిగిన కొన్ని ఫొటోలు కనిపించాయి. దీంతో బయట వినిపిస్తున్న రూమర్స్ ని ఏమైనా నిజం చేస్తారా అని నెటిజన్లు మాట్లాడుకుంటున్నారు.

# ఆమిర్‌ని కలిసిన అల్లు అర్జున్.. భారీ ప్రాజెక్ట్ కోసమేనా?



బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ తో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ భేటీ అయ్యారు. ముంబైలోని ఆమిర్ నివాసానికి వెళ్లిన బన్నీ..ఆయనతో కాసేపు ముచ్చటించారు. ఇలా ఉన్నపళంగా ఆమిర్‌తో బన్నీ బేటీ కావడంపై రకరకాల పుకార్లు వెల్లువడుతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్‌లో ఓ భారీ ప్రాజెక్ట్ రాబోతుందని, దాని కోసమే ఆమిర్‌ని కలిశాడని బాలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం ఆమిర్ తన తదుపరి చిత్రం సితారే జమీన్ పర్ పనుల్లో బిజీగా ఉన్నాడు. ఆ తర్వాత ఆయన భారీ బడ్జెట్ తో 'మహా భారతం' తీయాలని చూస్తున్నాడు. ఈ సినిమాలో స్టార్ హీరోలు నటిస్తారని ఇటీవల ఆయన ప్రకటించారు. తాజాగా బన్నీ వెళ్లి కలవడంతో..'మహా భారతం'కోసమే ఈ భేటీ జరిగిందనే ప్రచారం మొదలైంది. దీనిపై అధికారిక ప్రకటనలు ఏవీ రాకపోయినా, అటు బాలీవుడ్‌తో పాటు ఇటు టాలీవుడ్‌లోనూ ఇప్పుడు బన్నీఆమిర్ భేటీనే హాట్ టాపిక్‌గా మారింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం బన్నీ అట్లీ సినిమాతో బీజీగా ఉన్నారు. ఇందులో ఆయన డ్యూయల్ రోల్ ప్లే చేయబోతున్నారు. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే బన్నీ షూటింగ్‌లో పాల్గొంటారు. ఇందులో హాలీవుడ్ తరహాలో విజువల్స్ ఉండబోతున్నాయట. ఈ సినిమాలో ముగ్గురు కథానాయికలు నటించనున్నారని, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్‌లను ఇప్పటికే ఖరారు చేసినట్లు తెలుస్తోంది. మూడో కథానాయికగా 'లైగర్' ఫేమ్ అనన్యా పాండేను ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. సన్ పిక్చర్స్, గీతా ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందించనున్నారని సమాచారం.



# రూ.10 కోట్లు దానం చేసిన హీరో సూర్య

తమిళ హీరో సూర్య మంచి మనసు చాటుకున్నాడు. గత కొన్నాళ్లుగా సినిమాలైతే చేస్తున్నాడు గానీ సరైన హిట్ పడట్లేదు. రీసెంట్ గా రెట్రో మూవీతో ప్రేక్షకుల్ని పలకరించాడు. తెలుగులో తేలిపోయింది గానీ తమిళంలో మంచి వసూళ్లు సాధిస్తోంది. ఇప్పుడు తన చిత్రానికి వచ్చిన లాభాల నుంచి ఏకంగా రూ.10 కోట్లని సూర్య దానం చేశాడు. రెట్రో సినిమాలో సూర్య హీరోగా నటించాడు. ఇతడికి చెందిన 2డీ ఎంటర్ టైన్ మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. తాజాగా రూ.104 కోట్ల మేర గ్రాస్ వసూళ్లు వచ్చినట్లు అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే లాభాలు రావడంతో హీరో కమ్ నిర్మాత అయిన సూర్య ఫుల్ హ్యాపీ అయిపోయాడు. తనకు చెందిన అగరం ఫౌండేషన్ కి రూ.10 కోట్లు దానం చేశాడు. ఈ మేరకు నిర్వహకులకు చెక్ అందజేశాడు. 2006లో అగరం ఫౌండేషన్ ని సూర్యనే స్థాపించాడు. తమిళనాడులో చదివించే స్థోమత లేని చాలామంది పిల్లలని చదివించడమే ఈ సంస్థ ఉద్దేశం. ఇప్పటికే చాలామంది అగరం ద్వారా చదువుకుని ప్రయోజకులు అయ్యారు.

## క్రీడా వార్తలు | SPORTS NEWS





# కోల్‌కతాకు చెన్నై ఝలక్

## 2 వికెట్లతో సూపర్ కింగ్స్ విజయం

**కోల్‌కతా:** ఐపీఎల్ 'ప్లే ఆఫ్స్' రేసు నుంచి ఇప్పటికే నిష్క్రమించిన చెన్నై సూపర్ కింగ్స్ కీలక పోరులో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ అవకాశాలపై దెబ్బ కొట్టింది. ఈడెన్ గార్డెన్స్‌లో ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో చెన్నై 2 వికెట్ల తేడాతో నైట్‌రైడర్స్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కోల్‌కతా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. అజింక్య రహానే (33 బంతుల్లో 48; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆండ్రీ రసెల్ (21 బంతుల్లో 38; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), మనీశ్ పాండే (28 బంతుల్లో 36 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) రాణించగా...నూర్ అహ్మద్‌కు 4 వికెట్లు దక్కాయి.

అనంతరం చెన్నై 19.4 ఓవర్లలో 8 వికెట్లకు 183 పరుగులు సాధించింది. డెవాల్డ్ బ్రెవిస్ (25 బంతుల్లో 52; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేయగా...శివమ్ దూబే (40 బంతుల్లో 45; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడిన ఉర్విల్ పటేల్ (11 బంతుల్లో 31; 1 ఫోర్, 4 సిక్స్‌లు) కీలక పరుగులు సాధించారు. పవర్‌ప్లే లోపే సగం వికెట్లు కోల్పోయి 60/5 వద్ద నిలిచిన చెన్నై ఓటమి ఇక లాంఛనమే అనిపించింది. కానీ బ్రెవిస్, దూబే పోరాడంతో పాటు చివర్లో ధోని (17 నాటౌట్) పట్టుదలగా నిలబడటంతో గెలుపు సాధ్యమైంది. తాజా ఫలితంతో కోల్‌కతా 'ప్లే ఆఫ్స్'కు వెళ్లడం దాదాపు అసాధ్యంగా మారింది. మిగిలిన 2 మ్యాచ్‌లలో గెలిచి గరిష్టంగా 15 పాయింట్లకు చేరినా ముందుకెళ్లడం కష్టమే. సాంకేతికంగా రేసులో ఉన్నా... ఈసారి కథ ముగిసినట్లే!

**ఐపీఎల్‌లో నేడు**
**పంజాబ్ X ఢిల్లీ, వేదిక: ధర్మశాల**
**రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం**

# పడిక్కల్‌కు ప్రత్యామ్నాయ ఆటగాడిని ప్రకటించిన ఆర్సీబీ

ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ఆర్సీబీ 11 మ్యాచ్‌ల్లో 8 విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతూ, ప్లే ఆఫ్స్ బెర్త్‌కు అతి సమీపంలో ఉంది. ఈ సీజన్‌లో ఆర్సీబీ ప్లే ఆఫ్స్‌కు ముందు మరో మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. వీటిలో ఒక్క మ్యాచ్ గెలిచినా ఆ జట్టు ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారవుతుంది. ఆర్సీబీ తమ తదుపరి మ్యాచ్‌ల్లో లక్నో (మే 9), సన్‌రైజర్స్ (మే 13), కేకేఆర్‌లతో (మే 17) తలపడనుంది. కాగా, ఆర్సీబీకి సీఎస్‌కేతో ఆడిన గత మ్యాచ్‌లో ఓ ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు వన్‌డౌన్ ఆటగాడు, ఇన్‌ఫామ్ ప్లేయర్ దేవ్‌దత్ పడిక్కల్ గాయపడ్డాడు. తాజాగా ఆర్సీబీ యాజమాన్యం పడిక్కల్ స్థానాన్ని భర్తీ చేసింది. పడిక్కల్‌కు ప్రత్యామ్నాయ ఆటగాడిగా మయాంక్ అగర్వాల్‌ను ఎంపిక చేసింది. మయాంక్‌ను ఆర్సీబీ కోటి రూపాయలకు దక్కించుకుంది. 34 ఏళ్ల మయాంక్‌కు ఐపీఎల్‌లో మంచి ట్రాక్ రికార్డు ఉంది. 2011 నుంచి అతను వివిధ ఫ్రాంచైజీల తరఫున 127 మ్యాచ్‌లు ఆడి 2661 పరుగులు చేశాడు. ఇందులో ఓ సెంచరీ, 13 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. గత సీజన్‌లో మయాంక్ సన్‌రైజర్స్‌లో ఉన్నాడు. ఈ సీజన్ మెగా వేలంలో మయాంక్‌ను ఏ జట్టు కొనుగోలు చేయలేదు. తమ తొలి టైటిల్ వేటను విజయవంతంగా సాగిస్తున్న ఆర్సీబీకి మున్ముందు ఆడబోయే కీలక మ్యాచ్‌ల్లో మయాంక్ ఏ మేరకు తోడ్పడతాడో చూడాలి. మయాంక్‌కు గతంలో (2011) ఆర్సీబీకి ఆడిన అనుభవం ఉంది. మయాంక్ స్వస్థలం బెంగళూరే కావడం అతనికి కలిసొచ్చే అంశం. మయాంక్ దేవ్ స్థానాన్ని భర్తీ చేయగలడో లేదో చూడాలి. దేవ్ ఈ సీజన్‌లో 10 మ్యాచ్‌లు ఆడి 247 పరుగులు చేశాడు.



## హ్యారీ బ్రూక్‌కు ప్రత్యామ్నాయంగా అటల్


లీగ్ ప్రారంభానికి ముందు వైదొలిగిన హ్యారీ బ్రూక్ స్థానాన్ని ఆఫ్ఘనిస్తాన్ ఆటగాడు సెదిఖుల్లా అటల్‌తో భర్తీ చేసింది ఢిల్లీ క్యాపిటల్స్. ఢిల్లీ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉంది. ఈ జట్టు ఇప్పటివరకు ఆడిన 11 మ్యాచ్‌ల్లో 6 విజయాలు సాధించి 13 పాయింట్లతో ప్లే ఆఫ్స్ రేసులో కొనసాగుతుంది.




## బ్రెవిస్ విధ్వంసం.. ఒకే ఓవర్‌లో 30 పరుగులు

వైభవ్ అరోరా వేసిన 11వ ఓవర్‌లో డెవాల్డ్ బ్రెవిస్ శివాలెత్తిపోయాడు. 3 ఫోర్లు, 3 సిక్సర్లు సహా 30 పిండుకున్నాడు. ఈ ఒక్క ఓవర్‌తో మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. అప్పటి వరకు ఓటమి ఖాయమనుకున్న సీఎస్‌కే ఒక్కసారిగా గెలుపు ట్రాక్‌లోకి వచ్చింది.బ్రెవిస్ 20 బంతుల్లో 50 పరుగులు పూర్తి చేశాడు.

# రికార్డుల్లోకెక్కిన రహానే



ఐపీఎల్ 2025లో భాగంగా కేకేఆర్, సీఎస్‌కే మధ్య ఇవాళ (మే 7) జరుగుతున్న మ్యాచ్‌లో అజింక్య రహానే ఓ అరుదైన మైలురాయిని తాకాడు. ఈ మ్యాచ్‌లో 33 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 48 పరుగులు చేసి ఔటైన రహానే.. ఐపీఎల్‌లో 5000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. తద్వారా క్యాష్ రిచ్ లీగ్‌లో ఈ ఘనత సాధించిన ఏడో భారత ఆటగాడిగా, ఓవరాల్‌గా తొమ్మిదో ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు. రహానే తన 197 ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో ఈ ఘనత సాధించాడు. రహానేకు ముందు విరాట్ కోహ్లి (8509), రోహిత్ శర్మ (6928), శిఖర్ ధవన్ (6769), డేవిడ్ వార్నర్ (6565), సురేశ్ రైనా (5528), ఎంఎస్ ధోని (5406), ఏబీ డివిలియర్స్ (5162), కేఎల్ రాహుల్ (5064) ఐపీఎల్‌లో 5000 పరుగుల మార్కును అధిగమించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com